Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 17.11.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 24 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## ప్రతిపక్షం లేని అసెంబ్లీ...

# శోభ కోల్పోయిన సభ



- సమస్యలపై చర్చలు నిల్
- భజనలు, పొగడ్తలు ఫుల్
- స్పీకర్‌కు పెద్ద అప్రదిష్ట

ప్రతి ఎమ్మెల్యేకు కూడా అసెంబ్లీ హాల్‌లో కూర్చుని 'అధ్యక్షా' అంటూ లేచి మాట్లాడాలన్నది ఒక కల. వాళ్ళకు ఎమ్మెల్యే అనే ఫీలింగ్ వచ్చేది ఆ అసెంబ్లీ సమావేశాలలో లేచి మాట్లాడినప్పుడు... ఆయన మాట్లాడుతున్నది టీవీ ఛానల్స్‌లో తన నియోజకవర్గ ప్రజలు చూసి నప్పుడు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి పాతఎమ్మెల్యేలే కాకుండా కొత్తగా ఎన్నికైన సభ్యులు కూడా సభలోకి అడుగు పెడుతుంటారు. శాసనసభ సమావేశాలన్నవి అలాంటి వారికి ప్రజాసమస్యల చర్చా వేదికలు కావాలి. ఏ పార్టీ అధికారంలో వున్నా ఇంతవరకు సభా సమావేశాలు అలాగే జరుగుతూవచ్చాయి.

(మిగతా 11వ పేజీలో)

దేశం లో...

# పాదయాత్ర ప్రకంపనలు

• పోటెత్తుతున్న జనం... అడుగడుగునా నీరాజనం!


11లో









# నెల్లూరును తాకిన విషాదం

## పడవ ప్రమాదంలో ముగ్గురు జిల్లావాసుల కన్నుమూత





కోటి దీపోత్సవం చూడాలని వెళ్తే... వారిని మృత్యువు కర్కశంగా పొట్టన బెట్టుకుంది. పడవ రూపంలో పగబట్టి మరీ కాటేసింది. అభం శుభం తెలియని ఏడేళ్ల చిన్నారితో పాటు, మరో ఇద్దరు మహిళలు కూడా ఈ దుర్ఘటనకు బలై పోయారు. ఆ ముగ్గురూ ఒకే కుటుంబం వారే. వీరంతా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వాసులే. కృష్ణానదిలో పవిత్ర సంగమం వద్ద జరిగే కార్తీక కోటి దీపోత్సవ హారతిని దర్శించుకోవాలనే తపనతో విజయవాడకు వెళ్ళి అందరితో పాటు ఆ పడవ ఎక్కారు. అయితే, దురదృష్టవశాత్తూ మధ్యలో పడవ ప్రమాదానికి గురికావ డంతో వారు నీటిలో మునిగిపోయి మృతి చెందారు. అటు చూసి ఇటు తిరిగేలోగా ఈ దుర్ఘటన జరిగిపోయింది. 22 మంది పర్యాటకులు హాహాకారాలు చేస్తూ నీటిలో మునిగిపోయి.. జలసమాధి అయిన ఈ విషాద సంఘటనలో జిల్లా వాసులు ముగ్గురు ఉండడంతో వారి కుటుంబ సభ్యుల వేదనా రోదనలు మిన్నుముట్టాయి. మృతి చెందిన ఆ ముగ్గురు కూడా సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణకు దగ్గరి బంధువులు. ఆయన బావమరిది భార్య పోపూరి లలితమ్మ, వారి కోడలు పోపూరి హరిత, మనుమరాలు పోపూరి అశ్విక ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ముగ్గురి మరణంతో వారి కుటుంబాల్లోనే కాక, కురుగొండ, పొదలకూరు గ్రామాలు కూడా విషాదంలో మునిగిపోయాయి. ఓజిలి మండలంలోని కురుగొండ, పొదల కూరు ప్రాంతాలకు చెందిన ఈ ముగ్గురూ బంధువులతో కలసి ఈనెల 13న కృష్ణా నదిలో ఎంతో వైభవంగా జరిగే కోటి దీపోత్సవ హారతిని తిలకించేందుకు విజయవాడకు వెళ్ళారు. వారు ఎక్కిన బోటు బోల్తా పడడంతో ఈ ముగ్గురు నీటిలో మునిగిపోగా, వీరితో పాటు వెళ్ళిన బొల్లినేని కుమారి, కుడితపూడి సుగుణమ్మ, ఈశ్వరమ్మ, దారపనేని విజయశ్రీలను సమీపంలో ఉన్న మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో వారు ఎలాగో బతికి బయటపడ్డారు. ఏడేళ్ళ చిన్నారి అశ్విక ఈ దుర్ఘటనలో కన్నుమూయడంతో ఆ కుటుంబం విలవిలలాడుతోంది. కురుగొండలో నివసిస్తున్న పోపూరి బాపారావు మను బోలుకు చెందిన లలితమ్మను వివాహం చేసుకున్నారు. ఆయన గూడూరులోని సెంట్రల్‌బ్యాంక్ ఉద్యోగిగా అయిదేళ్ళ క్రితం రిటైరయ్యారు. ఈ ఘటనలో భార్య లలితమ్మ, మనుమరాలు అశ్విక మృతితో బాపారావు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరణించినవారికి ఈనెల 14న అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం వారి మృతదేహాలు కురుగొండకు చేరుకోగానే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మృతులకు కన్నీటి నివాళు లర్పించారు. సిపిఐ నేత నారాయణ గ్రామానికి వచ్చి దగ్గరుండి అంత్యక్రియలను పర్యవేక్షించారు. బావమరిది లక్ష్మీ బాపారావు, మేనల్లుడు ప్రభుకిరణ్‌లను ఓదార్చారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఆర్డీఓ శీనానాయక్‌లు పాల్గొని మృతులకు నివాళులర్పించారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే...

## - ఎమ్మెల్యే కిలివేటి విమర్శ



విజయవాడ వద్ద కృష్ణానదిలో పడవ ప్రమాదం జరిగి 22 మంది మరణించడం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనేనని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తీవ్రంగా విమర్శించారు. బుధవారం ఆయన సూళ్లూరులోని నాగరాజపురంలో పల్లెనిద్ర–రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓటుకు నోటు కేసుకు భయపడి విజయవాడకు వచ్చి నిరంకుశ పాలన చేస్తున్నారని, కృష్ణానదిలో సుమారు 300 పడవలు అనుమతులు లేకుండా తిరుగుతున్నా పర్యాటకశాఖ మంత్రి ఏం చేస్తున్నారని విమర్శించారు. ఈ దుర్ఘటనలో తన నియోజకవర్గానికి చెందిన ముగ్గురు మరణించడం ఎంతో బాధాకరమన్నారు. 22మంది వైఎస్సార్సీపి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, నలుగురికి మంత్రి పదవులిచ్చి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలుచేశారంటూ ఆయన టిడిపి విధానాలను దుయ్యబట్టారు. అలాంటి పరిస్థితుల్లో శాసనసభలో కూర్చోలేక ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు పల్లెనిద్ర, రచ్చబండ కార్యక్రమం చేపట్టామన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు అందరూ మద్దతునిచ్చి ఆదరించాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి నలుబోయిన రాజసులోచనమ్మ, పట్టణ పార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, మండలాధ్యక్షురాలు షేక్ షమీమ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ముత్తుకూరు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలకు పింఛన్లు

చేనేతకారులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరుచేస్తోందని, 50 ఏళ్ళు నిండిన అర్హులైన చేనేత కార్మికులకు ఈ పింఛన్లు అందజేస్తారని టిడిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు సంగీత బంగారయ్య తెలిపారు. నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఈ నెల 12న నిర్వహించిన జిల్లా చేనేతకారుల కార్యవర్గసమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత నేత ఎన్టీఆర్ అప్పట్లో జనతా వస్త్రాల పథకం ప్రవేశపెట్టి చేనేతలకు జీవనభృతి కల్పించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేనేతకారుల కోసం వెయ్యి రూపాయల పింఛన్ అందజేస్తోందన్నారు. గుర్తింపుకార్డు లేని వారు ధరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జొన్నాదుల రవికుమార్, కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

# ఆలయాలను అభివృద్ధి చేయాలి

హిందూ సంస్కృతి ఎంతో విశిష్టమైనదని, మన సంస్కృతిని గౌరవించుకుని పరిరక్షించుకోవాలని, హిందూ దేవాలయాలను బాగా అభివృద్ధి చేసుకోవాలని పూజ్యశ్రీ కమలానందభారతి స్వామీజీ అన్నారు. రాపూరు మండలంలోని సిద్ధవరం, మసీదుపేట గ్రామాల్లో ఈ నెల 12న స్వామీజీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన ధర్మాన్ని మనం కాపాడుకోవాలన్నారు. దేవాలయాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడి, ప్రశాంతమైన జీవితాలను సాగించవచ్చన్నారు. ప్రతినిత్యం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తే, ఆ భగవంతుని అనుగ్రహం కలిగి సుఖసంతోషాలతో జీవించవచ్చన్నారు. ప్రజల్లో హిందూ సంస్కృతి పట్ల చైతన్యం తీసుకువచ్చేందుకు తాను రథయాత్రను చేపట్టినట్లు స్వామీజీ తెలిపారు.

# ప్రత్యేక ఆకర్షణగా చెంగాళమ్మ తల్లి

విజయవాడలో జరుగుతున్న కోటి దీపోత్సవంలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరిగిన నవదుర్గల పూజల్లో నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట నుంచి తరలివెళ్లిన చెంగాళమ్మ పరమేశ్వరి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తుల కోర్కెలు తీర్చేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా ఆలయానికి తలుపులేని తల్లిగా చెంగాళమ్మ ప్రసిద్ధి. కాగా, అమ్మవారి ప్రాశస్త్యాన్ని తెలుసుకున్న భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకున్నారని ఆలయ ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి, ఇ.ఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# ముస్లింల అభివృద్ధికి కృషి చేయాలి

## - నెల్లూరు ఎం.పి మేకపాటి

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని నెల్లూరు ఎం.పి మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం పోలినాయుడు చెరువు గ్రామంలో జరిగిన రచ్చబండ – పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చి పెద్దపీట వేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డిదేనన్నారు. వై.యస్.జగన్ సీఎం అయిన తర్వాత ముస్లింల అభివృద్ధికి తగిన ప్రణాళికను రూపొందించి అమలు జరుపుతారని తెలిపారు. వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముస్లింల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచాలన్నారు. వైయస్సార్సీపీ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కలువ బాలశంకర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, ప్రధానకార్యదర్శి ఇప్పగుంట విజయ్‌భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# అలరించిన కవి సమ్మేళనం




యూనియన్ ఆఫ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నెల్లూరు టౌన్‌హాలులో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్ మాట్లాడుతూ సమాజం నిత్య చైతన్యంతో కొనసాగేందుకు సాహిత్యం దోహదపడుతుందన్నారు. తెలుగు భాషా సంఘ నాయకులు ఎన్.బలరామయ్యనాయుడు మాట్లాడుతూ సజీవమైన ప్రక్రియ సాహిత్యమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థల అధినేత ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ సాహిత్యం సమాజపు మార్గదర్శి అన్నారు. చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్‌మేషన్ సెంటర్ ఛైర్మెన్ ఎస్.వి.రమేష్, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, వి.వెంకటేశ్వర్లు, మజ్జిగ ప్రభాకరరెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు సర్వేపల్లి రామమూర్తి, హనూక్‌లు పాల్గొన్నారు. కవి సమ్మేళనాన్ని గుర్రాల రమణయ్య నిర్వహించారు. అనంతరం కవులకు పురస్కారాలు అందజేశారు.

# బయోమెట్రిక్‌పై నిర్లక్ష్యం వద్దు

## - ఎక్సైజ్ డి.సి

ప్రభుత్వోద్యోగులు విధులకు సక్రమంగా రాకపోవడం, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో రాష్ట్రప్రభుత్వం ఇటీవల అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీచేసిందని, అయితే రోజులు గడుస్తున్నా పలుచోట్ల ఎక్సైజ్ కార్యాలయాల్లో బయోమెట్రిక్ విధానం ఏర్పాటు చేయకపోవడం ఏమిటని, ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ శ్రీనివాసరావు సిబ్బందిపై మండిపడ్డారు. బయోమెట్రిక్ విధానం తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని ఆయన సిబ్బందిని హెచ్చరించారు.

## జల విద్యుత్‌తో...

# మెరుగైన విద్యుత్

జల విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి జరిగే విద్యుత్తుతో మెరుగైన విద్యుత్తు సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా సోమశిలలో ఉత్తర కాలువకు అనుబంధంగా నిర్మించిన బాలాజీ ఎనర్జి కంపెనీ 11మెగావాట్ల సామర్థ్యంగల రెండు జల విద్యుత్ కేంద్రాలను ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజుతో కలసి ఈ నెల 12వ తేదీన ప్రారంభించారు. అనంతరం సోమేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించారు. ఆలయంలోని మూలవిరాట్టుకు కామాక్షితాయికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కలెక్టర్ ముత్యాలరాజుతో కలసి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జలాశయాల్లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రాష్ట్రంలో పంటలు బాగా పండే అవకాశాలు ఉన్నాయన్నారు. శిక్షణ కలెక్టర్లు ఉదయ్‌కుమార్, మహేష్, విద్యుత్ శాఖ ఎస్.ఇ విజయకుమార్, డిఎస్పీ రామాంజనేయరెడ్డి, సోమశిల ఇ.ఇ దేశ్‌నాయక్, తహశీల్దార్ చెంచు కృష్ణమ్మ, సోమశిల, అనంతసాగరం ఎస్సైలు జగన్మోహన్‌రావు, రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా ఆక్రమణల క్రమబద్ధీకరణ

## - జిల్లా కలెక్టర్ వెల్లడి



ఆక్రమణల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జి.ఓ విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజు వెల్లడించారు. నెల్లూరులోని లేక్‌వ్యూ కాలనీ, వెంగళరావునగర్, జ్యోతి నగర్ ప్రాంతాల్లో చేపడుతున్న ఆక్రమణల సర్వేను కలెక్టర్ 15వ తేదీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులు, సర్వేసిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నగరంలోని ఆక్రమణలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఆక్రమణల స్థలాలను అభ్యంతరకరంగా ఉన్నవాటిని విభజించడం జరిగిందన్నారు. స్థలాలను పూర్తిస్థాయిలో పరిశీలించి క్రమబద్ధీకరిస్తామన్నారు. 2014 జనవరి 11 నాటికి క్రమబద్ధీకరించే స్థలానికి ఇంటిపన్ను, విద్యుత్, ఇతర చెల్లింపులు తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లాలో క్రమబద్ధీకరణకు ఆశించిన స్థాయిలో ప్రజలు ముందుకు రావడం లేదన్నారు. కార్పొరేషన్ పరిధిలో 6591 ధరఖాస్తులు, ఇతర మునిసిపాలిటీల్లో 2500 ధరఖాస్తులు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. స్థలానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో 2014 నాటి ధరే చెల్లించే అవకాశం ఉందన్నారు. గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాలను లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసినవారికి అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 15 నాటికి ఆక్రమణల సర్వే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు, టౌన్‌ప్లానింగ్ అధికారి సూరజ్ తదితరులు పాల్గొన్నారు.



స్నేహ బంధంతో ఆత్మీయ పలకరింపు కోసం ఇటీవల నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని తన ఇంటికి విచ్చేసిన రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణని శాలువతో సత్కరించి అభినందిస్తున్న 'లాయర్' పత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి.

# విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి

## - 'నవనీత' విద్యార్థులతో ముచ్చటించిన రాష్ట్రపతి



జిల్లాలోని చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు గ్రామంలో ఉన్న నవనీత పబ్లిక్‌స్కూలుకు చెందిన 7,8,9 తరగతులకు చెందిన 92 మంది విద్యార్థులు ఇటీవల ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి రామనాథ్ కోవింద్‌ను కలిశారు. కృష్ణపట్నం పోర్టు సివిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద గ్రామీణ విద్యార్థులకు సిఎస్ఆర్ యాక్టివిటీస్ ద్వారా కార్పొరేట్ విద్యను ఉచితంగా అందజేస్తున్న విషయాన్ని తెలుసుకుని నవనీత పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో రాష్ట్రపతి ప్రత్యేకంగా సమావేశమై ముచ్చటించారు. కృష్ణపట్నం పోర్టు ఇలాంటి అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన పాఠశాలను నిర్మించి పేదవిద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తూ ఎందరికో మార్గదర్శకంగా నిలిచిందని పాఠశాల యాజమాన్యాన్ని రాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రశంసించారు. విద్యార్థులనుద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసించి మంచిపౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మీ తల్లిదండ్రులకు, సంస్థకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలని, దేశాభివృద్ధికి పాటుపడాలని, అప్పుడే మీరు, మీ కుటుంబం, రాష్ట్రం, దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తాయన్నారు. కార్పొరేట్ సంస్థలు గ్రామీణ పేద విద్యార్థుల కోసం విద్యాసంస్థలను ఏర్పాటుచేసి వారికి ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్రపతి ఆదేశాల మేరకు అధికారులు రాష్ట్రపతి భవన్‌లోని అన్ని ప్రదేశాలను నవనీత స్కూలు విద్యార్థులు సందర్శించేందుకు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, భారత రాష్ట్రపతి రామనాథ్ కోవింద్‌ను కలవడం తమ జీవితంలో మరచిపోలేని సంఘటన అని అన్నారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో కృష్ణపట్నం పోర్ట్ మేనేజింగ్ డైరెక్టర్ చింతా శశిధర్, నవనీత పబ్లిక్‌స్కూలు ప్రిన్సిపాల్ సుజాతవర్మ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధితులకు అండగా నిలబడ్డ అనిల్

నెల్లూరు నగరంలోని 8వ డివిజన్ తడికలబజారు నందు కాలవ పక్కన ఉన్న ఇళ్ళను తొలగించేందుకు ఈ నెల 15న అధికారులు రాగా, నెల్లూరు నగర శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ బాధితులకు అండగా నిలబడి అన్ని వసతులతో పునరావాసం కల్పించిన అనంతరం తొలగించాలని అడ్డుకోవడంతో కార్పొరేషన్ అధికారులు, పోలీసులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ కాలువ పక్కన ఉన్న ఇళ్ళను తొలగించే ముందు వారికి ఎక్కడైనా ఇళ్ళ స్థలాలు చూపించాలని ఆరు నెలల నుంచి అధికారులకు చెబుతూనే ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పటికిప్పుడు ఈ ప్రాంతంలో జెసిబిలతో ఇళ్ళను తొలగించాలనుకుంటే ఊరుకునేది లేదని అధికారులను హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఉన్న 81మంది బాధితులకు రెవెన్యూ స్థలాలలో ఇళ్ళను నిర్మించి, కరెంటు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని అధికారులను కోరామన్నారు. అందుకు కార్పొరేషన్ అధికారులు స్పందించి, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి తిరిగి వెళ్ళారన్నారు. ఇళ్ళను నిర్మించి ఇస్తే మేమందరం వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నామని బాధితులు తెలిపారన్నారు. ధనవంతులను వదిలేసి, పేద వారి జోలికి రావడం పద్ధతి కాదని, పేదలను, ధనవంతులను అందరినీ సమదృష్టితో చూడాలన్నారు. అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇస్తామని అధికారులు తెలుపుతున్నారని, అందుకు పేదవారికి నెలకు



3 వేల రూపాయలు చెల్లించుకునే స్తోమత లేదని, ఎక్కడైనా స్థలాలు ఇచ్చి అందులో ఇళ్ళు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, నాయకులు డి.రఘు, పి.సోమనాథ్, రెడ్డిపోగు మోహన్, దాసరి గంగాధర్, వేలూరు మహేష్, వందవాశి రంగ, పి.సతీష్‌కుమార్, దార్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో జైళ్ళ శాఖ డి.జి పర్యవేక్షణ

ఏపి జైళ్ళ శాఖ డి.జి వినయ్‌రంజన్‌రే ఈ నెల 14న నెల్లూరు వచ్చారు. నెల్లూరు మూలాపేటలోని ఏపి స్టార్స్(జైళ్ళ శిక్షణ కళాశాల)లో త్వరలో నూతనంగా ఎంపికైన 250మంది వార్డర్ల శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ పనులను పర్యవేక్షించేందుకు వచ్చిన ఆయన జైలు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. శిక్షణకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. 15వ తేదీన ఏపి స్టార్స్, జిల్లా కేంద్ర కారాగారాన్ని పరిశీలించారు. ఈయన వెంట జైళ్ళ శాఖ ఐ.జి బి.జయవర్ధన్, జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎం.ఆర్.రవికిరణ్, ఏపి స్టార్స్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు ఉన్నారు.

# మిస్టర్ ఆంధ్ర బాహుబలిగా మేఘశ్యామ్

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో ఈ నెల 11న జరిగిన రాష్ట్ర స్థాయి శరీర సౌష్టవ పోటీల్లో నెల్లూరుకు చెందిన బాడీబిల్డర్ మేఘశ్యామ్ 85కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి మిస్టర్ ఆంధ్ర బాహుబలి టైటిల్‌ను దక్కించుకున్నాడు. మిస్టర్ ఆంధ్ర టైటిల్‌ను 1972లో నెల్లూరుకు చెందిన దివంగత బాడీ బిల్డర్ డి.వి.శేషయ్య సాధించారు. ఆయన తర్వాత ఈ టైటిల్‌ను సాధించింది మేఘశ్యామ్ కావడం విశేషం.

# కేవిఎస్ విద్యార్థులకు మంత్రి అభినందన

నెల్లూరు నగరంలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కెవిఎస్) విద్యార్థులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభినందించారు. ఈ నెల 12వ తేదీన విద్యార్థులు మంత్రిని కలిశారు. సేంద్రీయ ఎరువులపై వారు రూపొందించిన ప్రాజెక్టు వివరాలను మంత్రికి తెలియజేశారు. ఈ ప్రాజెక్టును ప్రభుత్వం అమలులోకి తీసుకురాగలిగితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వారి ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఇంతటి ప్రాజెక్టును రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ సరితారావు, సైన్స్ ఉపాధ్యాయులు భారతి, కొట్టే ఇంద్ర వికాస్, ఎం.సుదర్శన్ ఎన్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

# నిర్లక్ష్యానికి నిండుప్రాణాలు బలి

కాసుల కోసం కక్కుర్తి పడి ఓ ప్రైవేట్ బోట్ నిర్వాహకులు పడవను నిర్లక్ష్యంగా నడపడంతో 23 మంది నిండుప్రాణాలు జలసమాధి కావడం దయనీయం.. దారుణం. దురదృష్టకరం!.. కృష్ణానదిలో పవిత్రమైన హారతిని దర్శించుకోవాలన్న పర్యాటకుల ప్రాణాలకు భద్రత లేకపోవడం, ఇలా ఎవరి నిర్లక్ష్యానికో అమాయకుల ప్రాణాలు బలికావడం ఘోరం?.. ఇకనైనా ప్రభుత్వం అలక్ష్యం వీడి ఈ అక్రమ పడవ నిర్వాహకులపై, వాటి వెనుక ఉన్న సూత్రధారులపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలి.



కాసుల కోసం కక్కుర్తి పడి 23 మంది నిండుప్రాణాలను నిలువునా పొట్టనబెట్టుకున్నారు. కృష్ణానదిలో పవిత్రమైన హారతిని దర్శించుకోవాలన్న అమాయక పర్యాటకుల ప్రాణాలను గంగపాలు చేశారు. సముద్రంలో చేపలు పట్టేందుకు ఉపయోగించే పడవను కొద్ది మార్పులు చేసి పర్యాటకుల పడవగా మార్చి ప్రైవేట్ నిర్వాహకులు నిర్లక్ష్యంతో పడవ నడపడం వల్లనే పడవ నీట మునిగిపోయింది. కన్నుమూసి తెరిచే లోగా అంతమంది జీవితాలు ఒక్కసారిగా జలసమాధి అయిపోయాయి. స్వార్థం, ధనదాహం, అవినీతి, రాజకీయం అన్నీ కలగలిసి ఈ దుర్ఘటనకు దారితీశాయని చెప్పక తప్పదు. ప్రైవేట్ బోట్ నిర్వాహకుల నిర్లక్ష్యం, ప్రభుత్వ నిర్లిప్తత కలసి వెరసి మొత్తం 23 మంది ప్రాణాలు హరీమన్నాయి. ఈ దుర్ఘటనలో ఎక్కువమంది ఒంగోలు వారే. అంతేకాదు, నెల్లూరుజిల్లా వాసులైన ముగ్గురు కూడా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారిలో ఉన్నారు. ఏదేమైనా పడవ ప్రయాణంలో ఒక్కసారిగా ఇంతమంది మరణించడం అత్యంత బాధాకరం..దురదృష్టకరం. ఆకులు రాలాక చేతులు పట్టుకున్నట్లు, అంతమంది అత్యంత దయనీయంగా నీటిలో పడి దిక్కుతోచక.. ఊపిరాడక చనిపోయాక.. ఆ తర్వాత ఎవరెంత చేసినా.. ఎంతగా ఊరడించినా మృతుల కుటుంబాలకు జరిగిన లోటును పూడ్చగలమా?.వారి వేదనా రోదనలు తీర్చగలమా?...

ఒంగోలు వాకర్స్‌క్లబ్‌కు చెందిన 60 మంది బృందం ఇటీవల అమరావతికి వెళ్ళి అక్కడ పలు ప్రాంతాలు సందర్శించి, విజయవాడలోని పున్నమి ఘాట్‌కు చేరుకుని, కృష్ణానదిలో పవిత్ర సంగమం వద్ద నిత్యహారతిని తిలకించాలనుకున్నారు. అప్పటికే సాయంత్రం నాలుగున్నర గంటలు కావడంతో, ఏపి పర్యాటకశాఖకు చెందిన పడవ చీకటి పడుతోంది కనుక ఆ సమయంలో రాదని చెప్పడంతో, వారు తమ నిర్ణయం మార్చుకుని ఉన్నా ఈ ప్రమాదం తప్పి ఉండేదేమో!.. కానీ వారు అక్కడే ఉన్న ప్రైవేట్ బోట్‌ను మాట్లాడుకున్నారు. అప్పుడు పర్యాటకసిబ్బంది నివారించి ఉన్నా ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదేమో. అయితే, ఆ ప్రైవేట్ పడవే తమ పాలిట మృత్యుశకటమవుతుందని ఆ పర్యాటకులు ఊహించలేకపోయారు. ఆ పడవకు ఆ నదిలో తిరిగేందుకు అనుమతి లేకపోయినా, దానిలో 20 మందిని కూడా ఎక్కించేందుకు వీలులేకపోయినా, ఏకంగా 38 మందిని ఎక్కించేశారు. మొత్తం 47 మందితో పడవ బయలుదేరినట్లు అంచనా. అది సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి 5.20 గంటల ప్రాంతంలో పవిత్ర సంగమం వద్దకు చేరిందని, అక్కడ గోదావరి జలాలు కృష్ణానదిలో కలిసే సంగమ ప్రాంతం కనుక, నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో పడవ కుదుపులకు గురై, కొంచెం ముందుకు వెళ్ళగానే నదిలో ఇసుకమేటలు తగిలి పడవ ఒరిగిపోవడం, ఆ అదురుకు సారంగి ఒక్కసారిగా పడవను పక్కకు తిప్పడంతో పడవ బోల్తా పడిపోయినట్లు సమాచారం. ఈత వచ్చినవాళ్ళు ఎలాగో ప్రాణాలు కాపాడుకున్నారు. మరికొందరు బోటుకు వేలాడుతూ నీటిలో పడకుండా బయటపడ్డారు. నదిలో సహాయకచర్యలు చేపట్టే ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఆ సమయానికి అక్కడికి వచ్చి కొందరినైనా కాపాడడం అదృష్టమే. అయితే, అప్పటికే పలువురు నీటమునిగి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. కృష్ణానదిలోకి గోదావరి జలాలు ప్రవేశించే ప్రాంతం ఎంతో పవిత్రమైనదని, ఆ ప్రాంతాన్ని సందర్శించుకుంటే పుణ్యం వస్తుందని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం, ఆ నదిలో అక్రమ పడవలు తిరుగుతున్నా పట్టించుకోకపోవడమే దారుణం. సంధ్యా సమయంలో కృష్ణమ్మ హారతిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు భద్రతకు అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం..నదిలో అక్రమ పడవలు యధేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకునేవారు లేకపోవడం ఘోరాతిఘోరం. కృష్ణానదిలో ఈ పవిత్ర సంగమం వద్ద ప్రమాదానికి గురైన పడవకు జలవనరుల శాఖ నుంచి కానీ, పర్యాటకశాఖ, అగ్నిమాపకశాఖల నుంచి కానీ, ఏ శాఖ నుంచి కానీ ఎలాంటి కనీస అనుమతులు లేకపోవడం, ఏ అనుమతులు లేకున్నా, అసలు చీకటి పడే సమయంలో పడవ నడపరాదనే నిబంధనలున్నా ఆ పడవ మాత్రం యధేచ్ఛగా నదిలో విహారం చేస్తుండడం... ఏమిటిదంతా?.. ఇంత జరుగుతున్నా.. వారి కాసుల కక్కుర్తికి అమాయకుల ప్రాణాలు బలవుతున్నా...అడిగేవారు, అడ్డుకునేవారు ఎవరూ లేకపోవడం ఎంత దారుణం?..ఇదంతా కేవలం మానవ తప్పిదమే, అటు పడవ నిర్వాహకులు..ఇటు ప్రభుత్వ నిర్లక్ష్యమే అంతమంది నిండుప్రాణాలు బలికావడానికి కారణం కావడం విచారకరం. అందులోనూ ప్రమాదం జరిగిన ప్రాంతంలో కనీసం పది నుంచి పదిహేను మీటర్ల లోతు ఉంటుంది. అంతే కాదు, పడవ నడిపిన సారంగి కొత్తవాడు కావడం, పడవ నడపంలో అనుభవం లేకపోవడం, పడవలో కనీస రక్షణ పరికరాలు కానీ, లైఫ్ జాకెట్లు కానీ లేకపోవడం, నదిలో ఏ దారిలో ఎలా వెళ్ళాలో తెలియక పోవడం.. వగైరాలన్నీ, కలసిరాని కాలం వస్తే ఎలా దుర్భరంగా ఉంటుందో అలా అన్ని దురదృష్టాలూ కదిలివచ్చి అమాయకుల్ని నిలువునా కాటేశాయి. నదుల్లో పడవలు తిరగాలంటే జలరవాణాశాఖ అనుమతి తప్పనిసరి. అయినా, వాటిని ఖాతరు చేసేవారు. పర్యాటకులు ప్రైవేట్‌బోటు ఎక్కి, ప్రాణాల మీదికి తెచ్చుకున్నారని ప్రభుత్వం చెప్తున్నా, పర్యాటక సిబ్బందే ఆ ప్రైవేట్ బోటును పర్యాటకులకు సూచించారనే వాదనలూ విని పిస్తున్నాయి. అదే నిజమైతే ఎంత ఘోరం?..నదుల్లో ఇలా అక్రమంగా పడవలు నడుపుతున్నా ప్రభుత్వం నిర్లిప్తంగా ఉండడం వెనుక స్థానికంగా ఉన్న కొందరు ప్రముఖుల ప్రమేయం, రాజకీయ కారణాలు లేవనుకోలేం. ఇకనైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వదిలి.. ఆ అక్రమ ప్రైవేట్ పడవ యజమానులు, నిర్వాహకులపై..మొత్తంగా వీటి నిర్వహణలో ఉన్న పాత్రధారులు, సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో మరెక్కడా పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. లేకుంటే, ఆ నిర్లక్ష్యం కూడా ప్రభుత్వ తప్పిదమే అవుతుంది.

## నిరుపేద వృద్ధులకు దుప్పట్లు

నెల్లూరుకు చెందిన గణేష్ మిత్రమండలి సభ్యులు ఈ నెల 12న నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వృద్ధులు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మబ్బుపట్టి వానలు కురుస్తున్న ఈ రోజుల్లో చలికి తట్టుకోలేక బాధపడుతున్న అనేకమంది నిరుపేద వృద్ధులకు, రోడ్ల పక్కన చెట్ల కింద పడుకుని ఉన్న అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం, మూలాపేట గుప్తాపార్క్ రోడ్డు, ఆత్మకూరు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నిద్రిస్తున్న నిరుపేదలకు వాటిని అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు శ్రీధర్, రాజేష్, వినయ్, తరుణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్తుల ప్రత్యేక పూజలు

నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఉన్న అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఈనెల 12న 108 మంది అయ్యప్పభక్తుల ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష బిల్వార్చన కార్యక్రమం ఎంతో వేడుకగా జరిగింది. ఆలయ పాలకమండలి, మురళీకృష్ణ బృందం ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు జరిగాయి. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆలయ ఛైర్మన్ కొలపర్తి వెంకటరమేష్ కుమార్, ఆలయ ఇ.ఓ జానకమ్మ తదితరులు పాల్గొని ఈ వేడుకలను పర్యవేక్షించారు.

## శ్రీ సత్యసాయికి ప్రత్యేక పూజలు

శ్రీ సత్యసాయిబాబా జయంతి సందర్భంగా ఈ నెల 12న నెల్లూరు గోమతి నగర్‌లో ఉన్న సత్యసాయి సేవాసమితి భజన మందిరంలో శ్రీ సత్యసాయికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ శేషగిరిరావు మాట్లాడుతూ, స్వామివారి జయంతిని పురస్కరించుకుని ఈనెల 23వ తేది వరకు భజనలు నిర్వహిస్తామని, 23న మహా నారాయణసేవ, ఊంజల్‌సేవ, మహామంగళ హారతి నిర్వహిస్తామన్నారు. సాంస్కృతికోత్సవంలో భాగంగా పాట కచ్చేరీ ఉంటుందన్నారు. భక్తులందరూ పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని, శ్రీ సత్యసాయి వారి కృపాకటాక్షాలు పొందాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.




## సిగ్గుంటే సవాల్‌కు రావాలి

ప్యారడైజ్, పనామా పేపర్ల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏ మాత్రం తన మీద తనకు నమ్మకమున్నా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించి వుండాలి. ప్యారడైజ్ పేపర్లలో జగన్ పేరుందంటూ పచ్చపత్రికలు రాయగానే చంద్రబాబు నీతి వాక్యాలు బోధించాడు. జగన్ వల్ల ప్రపంచ దేశాలలో ఆంధ్రప్రదేశ్‌కు చెడ్డపేరు వస్తుందని మాట్లాడాడు. రాష్ట్రానికి జగన్ వల్ల చెడ్డ పేరు రావడం కాదు, చంద్రబాబు అక్రమాల వల్ల చెడ్డపేరొస్తుంది. బాబు గారి దూప్ షాట్ పనులవల్ల ఆంధ్ర పేరు పోతుంది. ఓటు–నోటు కేసు వల్ల హైదరాబాద్ నుండి తల దించుకు రావాల్సి వచ్చింది. మా ఇంజనీర్లు కడితే అవి మురికివాడలవుతాయంటూ ఆంధ్రప్రదేశ్ ఇంజనీర్ల పరువుతీసింది చంద్రబాబు. ఈ రాష్ట్రంలో ఇంజనీర్లు, ఈ రాష్ట్రానికి చెందిన కన్‌స్ట్రక్షన్ కంపెనీలు రాజధాని నిర్మాణానికి పనికి రావంటూ విదేశాల వెంట పరుగులు తీస్తున్న చంద్రబాబే ఇతర దేశస్థుల వద్ద ఆంధ్రప్రదేశ్‌కు చెడ్డపేరు తెస్తున్నాడు.

– షేక్ నజీబ్, సూళ్లూరుపేట.

## దమ్ముంటే ఆ రెండింటిని జాతీయం చేయండి

ప్రధాని నరేంద్ర మోడీ చేసిన నోట్ల రద్దు, జిఎస్టీ అమలు వల్ల పేదవారికి, మధ్య తరగతి ప్రజలకు ఒరిగేదేమీలేదు. ప్రధానికి నిజంగా పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేయాలనివుంటే విద్య, వైద్య రంగాలను జాతీయం చేయాలి. ఈ రెండు రంగాలు పూర్తిగా ప్రైవేట్ పరం అవుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం అందని ద్రాక్షపండ్లే అవుతున్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించాలన్నా, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం చేయించుకోవాలన్నా ఆస్తులు అమ్ముకోవాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితులు ఈ దేశంలో వున్నాయి. కాబట్టి పేద, మధ్య తరగతి ప్రజలు ఈ దేశంలో మనుగడసాగించాలి. ఈ రెండింటిని పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి. అప్పుడే ప్రజలందరూ నరేంద్రమోడీపై పెట్టుకున్న ఆశలు నెరవేరుతాయి.

జంపాల నరసింహారావు, నెల్లూరు.

## ఈ పాపం ఎవరిది?

కృష్ణా నదిలో బోటు ప్రమాదం నిర్లక్ష్యం వల్ల జరిగిందే! పర్యాటకుల బోటులో లైఫ్ జాకెట్లు కూడా లేకపోవడంతో ప్రాణనష్టం పెరిగింది. పర్యాటకులు కూడా సురక్షితం అనుకుంటేనే బోటు షికారుకు వెళ్ళాలి.

జి.పందరి, నెల్లూరు.

## తగ్గించి మంచి పని చేసారు

కొన్ని వస్తువుల మీద జిఎస్టీ తగ్గించి కేంద్ర ప్రభుత్వం మంచిపని చేసింది. లేకుంటే ప్రజల్లో వ్యతిరేకత బాగా పెరిగి వుండేది. ముఖ్యంగా హోటళ్ళలో బిల్లులపై జిఎస్టీని 18 నుండి 5 శాతానికి తగ్గించి వినియోగదారులకు ఎంతో మేలు చేశారు.

గుద్దూరు నరసరాజు, నెల్లూరు.

## కేరళలో దారుణాలు

కేరళలో కమ్యూనిస్టు గూండాలు రోజుకొక ఆరెస్సెస్ కార్యకర్తను హత్య చేస్తున్నారు. మేధావులు, లౌకికవాదులకు ఈ దారుణాలు కనిపించడం లేదా? ఒక వర్గం వారు చనిపోయినప్పుడే వాళ్ళ గొంతులు లేస్తాయా? ఉగ్రవాదులు, తీవ్రవాద మద్దతుదారులకు వత్తాసుపలకడానికి మాత్రమే ఈ దేశంలో మేధావులు, లౌకికవాదులు వున్నారా? కేరళలో నరరూప రాక్షస పాలన జరుగుతోంది. కేంద్రమే దీనిని అడ్డుకోవాలి.

సి.రాజీవి, నెల్లూరు.

# ఇప్పుడన్నా ఇస్తారా?









**తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది... మరి పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్ళ పాటు పార్టీ జెండాలు మోసిన వారికి ఏమిచ్చింది... నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీ నాయకుల్లో నెలకొన్న అసంతృప్తి ఇది. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి కంటే ప్రతిపక్షంలో వున్నప్పుడే తమకు విలువ వుండిందని, పార్టీ అధికారంలోకి వచ్చాక తమను వెనక్కు నెట్టేసి, కాంగ్రెస్, వైకాపాల నుండి వలసవచ్చిన వాళ్ళకు పెద్దపీట వేస్తున్నారంటూ జిల్లా టీడీపీలోని సీనియర్ నాయకులు ఆవేదన చెందుతున్నారు.**

## 'దేశం' నేతల్లో నివురుగప్పిన నిప్పులా అసంతృప్తి

ముఖ్యంగా నారాయణ మంత్రి అయ్యాక జిల్లాలో ఒరిజినల్ తెలుగుదేశం నాయకులకంటే వైకాపా, కాంగ్రెస్‌ల నుండి వచ్చినవాళ్ళకే పెద్దపీట వేశారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక జిల్లాలో ఇచ్చిన తొలి నామినేటెడ్ పదవి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్‌గా కాంగ్రెస్ నుండి వచ్చిన చాట్ల నరశింహారావును నియమించడం. ఆయన పూర్తిగా నారాయణ మనిషి. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా వైసిపి నుండి వచ్చిన ముప్పాళ్ళ విజేతను నియమించారు. అలాగే సూళ్ళూరుపేట చెంగాళమ్మ దేవస్థానం బోర్డు ఛైర్మెన్‌గా ముప్పాళ్ళ వెంకటేశ్వరరెడ్డిని నియమించారు. ఈ నియామకాల పట్ల సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని పార్టీ సీనియర్ నాయకులు తీవ్ర ఆగ్రహంతో వున్నారు. ఇక మొన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెండుసార్లు పోటీచేసి అన్ని విధాలా నష్టపోయిన దేశాయిశెట్టి హనుమంతురావును కాకుండా కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో చేరిన తన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని పెట్టుకున్నాడు మంత్రి నారాయణ. పట్టాభి ఓడిపోవడం తెలిసిందే!

ఎన్నికలు వేగంగా తరుముకొస్తున్న నేపథ్యంలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయడం అంటూ జరిగితే ఇప్పుడే జరగాలి. ఈమేరకు కసరత్తు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో రెడ్ల ఆధిపత్యం ఎక్కువ కాబట్టి ఆ సామాజికవర్గంకు ఈసారి పెద్దపీట వేయొచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే 'నుడా' ఛైర్మెన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నియమించివున్నారు. ఇక ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, కంభం విజయరామిరెడ్డి, టి.అనూరాధలలో ఇద్దరిని నామినేటెడ్ పదవులు వరించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆనం రామనారాయణరెడ్డి రావడం వల్ల ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ హోదాను కోల్పోయిన గూటూరు కన్నబాబును కూడా నామినేటెడ్ పదవికి ఎంపిక చేస్తారని సమాచారం. బలహీనవర్గాల నుండి డాక్టర్ జడ్.శివప్రసాద్, కాపు సామాజికవర్గం నుండి దేశాయిశెట్టి హనుమంతురావులకు ఖచ్చితంగా ఈసారి పదవులు ఇచ్చే అవకాశాలున్నాయి.

నామినేటెడ్ పదవులు ఇప్పటికే ఆలస్యమయ్యాయని తమ్ముళ్ళు అసంతృప్తితో వున్నారు. కనీసం ఇప్పుడన్నా పార్టీని నమ్ముకుని, పార్టీ జెండాలు మోసి, పార్టీ కోసం అన్ని విధాలా నష్టపోయినవాళ్ళకు పదవులు ఇస్తే గత అసంతృప్తిని కొంతన్నా మాయం చేసినవాళ్ళవుతారు.

# చేనేత కుటుంబానికి చేయూత



నెల్లూరురూరల్ నారాయణరెడ్డిపేటలో అగ్ని ప్రమాదానికి గురై ఇళ్ళు కాలిపోయిన గిడితూరి రామకృష్ణ అనే చేనేత కార్మికుడి కుటుంబాన్ని ఈ నెల 14వతేదీన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ నెల 14వ తేదీ 46వ రోజున దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నారాయణరెడ్డిపేటలలో పర్యటించారు. ఇళ్ళు కాలిపోయిన చేనేత కార్మికుడి కుటుంబానికి 10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాజకీయ నేతల కుటుంబాలు వెలిగిపోతుంటే, పేదలు, చేనేత కార్మికుల కుటుంబాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణరెడ్డిపేటలో ఎన్నో ఏళ్ళ నుండి చేనేత కుటుంబాలు కనీస సౌకర్యాలు లేక అభివృద్ధికి దూరంగా వుంటున్నాయని, వారి శ్రేయస్సు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# సోమిరెడ్డి కలలకు కార్యరూపం




కండలేరు ఎత్తిపోతల ద్వారా మెట్ట ప్రాంతాలైన రాపూరు, వెంకటగిరిలలో 30వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కల నెరవేరింది. కండలేరు జలాశయంపై 60కోట్ల వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ఈ నెల 13వ తేదీన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దేవినేని మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఆఖరుకల్లా జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్ట్‌లన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. సంగం, నెల్లూరు బ్యారేజీలను గడువులోగానే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కృష్ణా నీటిని పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గుండా సోమశిలకు తీసుకొచ్చి కండలేరుకు తరలిస్తున్నామని, కృష్ణా నుండి తరలించే నీటిని మరో 5 టీఎంసీలకు పెంచుతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నదుల అనుసంధానం వేగంగా జరుగుతోందని, వృథాగా పోతున్న గోదావరి జలాలను ఒడిసి పట్టి పెన్నాకు తరలించే భగీరథ ప్రయత్నం జరుగుతుందని, ఈ ప్రయత్నం పూర్తయితే ఈ జిల్లాలో సాగు నీటికి, తాగునీటికి కొరత వుండదని మంత్రి చెప్పారు.

## ఆశయం నెరవేరింది



కండలేరు ఎడమకాలువ గట్టు ఎత్తిపోతల పథకం పూర్తిగా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కృషి ఫలితమేనని చెప్పవచ్చు. ఈ పథకం ద్వారా 30వేల ఎకరాలకు సాగునీళ్ళు అందించవచ్చని గుర్తించిన ఆయన 2015లో ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పించి ఈ పనికి శంకుస్థాపన చేయించారు. అంతేకాదు, వేగంగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించారు. ఇచ్చిన మాట ప్రకారం దానిని రైతులకు నిర్ణీత గడువులోపే అందించగలిగారు. ఆయన కృషితో సర్వేపల్లి, వెంకటగిరి నియోజక వర్గాల్లోని వేలాది ఎకరాలకు నీళ్ళందాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, తిరుపతి ఎంపి వి.వరప్రసాద్, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పరసా రత్నం, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు పాల్గొన్నారు.

## ఆధునిక హంగులతో...

# రక్షకభట నిలయాలు

***పోలీసు స్టేషన్‌లంటే ఒకప్పుడు నరకానికి నమూనాగా వుండేవి. శిథిలావస్థలో వున్న భవనాలు... పెంకులు, పెచ్చులూడే శ్లాబులు... వానొస్తే నీళ్ళు కారే గదులు... కంపు కొట్టే బాత్రూంలు... తప్పు చేసి లాకప్‌లో వున్న వాళ్ళకే కాదు, ఉద్యోగ ధర్మంతో ఇక్కడ పనిచేసే పోలీసులకు కూడా నరకంగా వుండేది.***




ఇప్పుడు పోలీసుస్టేషన్‌లు మారుతున్నాయి. ఆధునిక పోకడలను సంతరించుకుంటూ అందంగా ముస్తాబవుతున్నాయి. నెల్లూరు నగరంలో ఒక్కో పోలీస్‌స్టేషన్ రూపం మారుతోంది. దాదాపు 20ఏళ్ల క్రితం నెల్లూరు నగరంలో బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌ను మోడల్ పోలీస్‌స్టేషన్‌గా నిర్మించారు. మొదట్లో గౌడ్ హాస్టల్ వద్ద పాడుబడిన బిల్డింగ్‌లో ఈ పోలీస్‌స్టేషన్ వుండేది. తర్వాత దానిని ఎస్పీ శ్రీనివాసరెడ్డి హయాంలో బాలాజీనగర్‌పార్క్‌లో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చారు. అప్పట్లో ఈ మోడల్ స్టేషన్‌కు ప్రత్యేకంగా డిఎస్పీని కూడా కేటాయించారు. ఆ తర్వాత అయ్యప్పగుడి వద్ద వున్న పార్కులో అయిదో నగర పోలీసుస్టేషన్ భవన సముదాయాన్ని ఎంతో అందంగా నిర్మించడమే కాక, పోలీసుస్టేషన్ ప్రాంగణంలో పచ్చదనంకు ప్రాధాన్యతనిచ్చారు. ఆ సమయంలోనే నెల్లూరు రెండోనగర పోలీసుస్టేషన్‌కు ఉన్న స్థలంలోనే కొత్త భవనాలు నిర్మించారు. ప్రస్తుత గూడూరు డిఎస్పీ రాంబాబు నెల్లూరు త్రీటౌన్ ఎస్.ఐగా వున్న సమయంలో ఈ స్టేషన్ పక్కనేవున్న ఖాళీ స్థలాన్ని ఒక చర్చివారు ఆక్రమించాలని చూసారు. అయితే ఎస్.ఐగా వున్న రాంబాబు అప్పట్లో వారి ఆటలు సాగనీయకుండా అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు సంబంధించిన ఆ స్థలాన్ని కాపాడారు. ఇప్పుడు అదే స్థలంలో సువిశాలంగా, ఆధునికంగా మూడోనగర పోలీసు స్టేషన్ రూపుదిద్దుకుంది. నెల్లూరు నగరంలో ఇదో అత్యుత్తమ పోలీసుస్టేషన్ భవనంగా తయారైంది. ఇక తాజాగా నెల్లూరు నాలుగోనగర పోలీసుస్టేషన్‌కు క్షయ ఆసుపత్రి ప్రాంగణంలో శంకుస్థాపన జరగడం తెలిసిందే! వాటన్నింటిని తలదన్నే రీతిలో దీనిని నిర్మించనున్నారు. ఇక పెద్దబజారులో వున్న ఒకటో నగర పోలీసు స్టేషన్‌లోనే మార్పులు చేయాల్సి వుంది. బ్రిటీష్ వారి హయాంలో కట్టిన భవనంలోనే ఇది కొనసాగుతోంది. అలాగే నెల్లూరురూరల్ పోలీసుస్టేషన్‌కు కూడా వెంటనే కొత్త భవనాలను నిర్మించాల్సి వుంది. మొత్తానికి పోలీసుస్టేషన్‌లు అంటే ఒకప్పుడు బూతుబంగ్లాలు గుర్తుకు వచ్చేవి. ఇప్పుడు కార్పొరేట్ బంగ్లాలను తలపించేలా అవి రూపుదిద్దుకుంటుండడం విశేషం.



### ముఖ్యమంత్రి మెప్పుపొందిన

# ముత్యాలరాజు



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా నెల్లూరు జిల్లాను మొదటి స్థానంలో నిలిపినందుకు జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. 14వ తేదీ అమరావతి నుండి సీఎం జిల్లా కలెక్టర్లతో సుదీర్ఘ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రజలు ఏ విధంగా ఫీలవుతున్నారన్న సమాచారాన్ని అధికారుల నుండి సీఎం రాబట్టారు. పథకాలన్నీ 98శాతం అమలవుతున్నాయని, ప్రజలు సూపర్, డూపర్ అంటున్నారని అధికారులు చెప్పారు. ఈ సందర్భంలోనే నెల్లూరుజిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణం సక్సెస్‌పై చర్చ జరిగి కలెక్టర్‌ను మెచ్చుకున్నారు.

## నెల్లూరు కబుర్లు

# నెల్లూరులోనే 'నీట్'

వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించే 'నీట్' పరీక్ష కోసం 2018 సంవత్సరం నుండి నెల్లూరులో కూడా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు కేంద్రప్రభుత్వం నుండి అనుమతి లభించినట్లు తెలుస్తోంది. నెల్లూరులో ఇంతకాలం ఎంసెట్ సెంటర్ వుండేది. కేంద్రం 2013 నుండి 'నీట్'ను ప్రవేశపెట్టింది. మన రాష్ట్రంలో తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలలో 'నీట్' సెంటర్లున్నాయి. అన్ని జిల్లాల విద్యార్థులు అక్కడకు వెళ్ళి 'నీట్' రాయాల్సి వచ్చేది. ఈ విద్యా సంవత్సరం నుండి నెల్లూరులో సెంటర్ పెడితే, విద్యార్థులే కాదు, వారి తల్లిదండ్రుల నెత్తిన కూడా పాలుపోసినట్లే! ఎందుకంటే పైనగరాలకు వెళ్ళి 'నీట్' పరీక్ష వ్రాయాలంటే పెద్ద ప్రహసనంగా వుండేది. ముందుగానే బస్సులు, రైళ్లలో టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవాలి. టిక్కెట్లు దొరక్కపోతే బాడుగ బండ్లు మాట్లాడుకోవాలి. పరీక్షకు ముందురోజే అక్కడకు వెళ్ళి హోటళ్లలో గది తీసుకుని వుండాలి. 'నీట్' టైంలో హోటళ్ళు బిజీగా వుండి రూములు దొరకడం కష్టంగా వుండేది. ఇక తిండి తిప్పలకు కూడా ఇబ్బంది పడే వాళ్ళు. నెల్లూరులో నీట్ సెంటర్ పెడితే ఆ ప్రయాస అంతా తప్పినట్లే! విద్యార్థుల తల్లిదండ్రులకు చాలా భారం తగ్గినట్లే!

# సాయిదర్బార్‌లో నిత్యాన్నదాన భవనం



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లో నిర్మించబోయే శ్రీ సాయి మాత నిత్యాన్నదాన ప్రసాదాలయ నిర్మాణానికి దాతలు సహాయ సహకారాలు అందించాలని శ్రీ సాయి దర్బార్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన సాయి పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ సాయినాథుని ఆశీస్సులతో, భక్తుల సహకారంతో శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో 2005 నుంచి గత 12ఏళ్ళుగా ఇప్పటివరకు ప్రతిరోజు పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. అన్నదాన భవన నిర్మాణానికి ఆలయ సమీపంలో 80అంకణాల స్థలం ఉందని దానిని కొనుగోలు చేసి 2 ఫ్లోర్లతో 100 అంకణాలు కట్టుబడి శాశ్వత భవనం ఏర్పాటుకు దాదాపు 2కోట్ల రూపాయలు వ్యయం అవుతుందన్నారు. భక్తులందరూ ఈ మహాయజ్ఞంలో భాగసాములై సహాయసహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాది పెనుబాక గంగాధరరెడ్డి, పాటోలు రామసుబ్బయ్య, జమ్మిన కృష్టారెడ్డి, కోట కృష్ణమూర్తిస్వామి పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా అధ్యక్షుడిగా చెంచయ్య

నెల్లూరు టూరిజం హోటల్‌లో ఈ నెల 11వ తేదీన ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.ఎ.సి జూనియర్ కళాశాల అధ్యాపకులు పులి చెంచయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎలక్ట్రికల్ ఏ.ఇ. సిహెచ్ సుధాకర్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నాయకులు నిర్మలాజ్యోతి, పి.పరంధామయ్య, పట్టపు శీనయ్య ఆధ్వర్యంలో పలు తీర్మానాలు రూపొందించారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు.

### రెండో శనివారం

# సెలవిచ్చారోచ్...

ప్రతి నెల రెండో శనివారం ఖచ్చితంగా సెలవు ఇవ్వాలన్న విద్యాశాఖ నిర్ణయాన్ని మొన్న రెండో శనివారం నాడు నెల్లూరులోని అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ స్కూల్స్ వాళ్ళు తూ.చ తప్పకుండా పాటించారు. శని, ఆదివారాలని లేకుండా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు ఆరోజున సెలవును ప్రకటించాయి.

### బాధ్యతలు తీసుకున్న

# ట్రాఫిక్ డిఎస్పీ

నెల్లూరు నగర ట్రాఫిక్ డిఎస్పీగా మల్లిఖార్జున ఇటీవల నెల్లూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ట్రాఫిక్ డిఎస్పీగా వుండి కృష్ణాజిల్లాకు బదిలీ అయిన రామారావు ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

### బి.సి కార్పొరేషన్

# ఇ.డి గా రాజేశ్వరి

బి.సి. సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా కె.రాజేశ్వరి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరుజిల్లా బి.సి సంక్షేమాధికారిగా పని చేస్తూ ఆమె బదిలీపై నెల్లూరుకు వచ్చారు.

### పశువైద్యుల సంఘం

# రాష్ట్ర అధ్యక్షుడిగా వసంతరాయులు

ఏ.పి పశువైద్య సహాయ శాస్త్ర చికిత్సకుల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరుజిల్లాకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఆర్.వసంతరాయులు ఎన్నికయ్యారు. గుంటూరులో ఈ నెల 12, 13తేదీల్లో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో తనను ఎన్నుకున్నట్లు వసంతరాయులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పశువైద్యులు ఆయనను అభినందించారు.

# జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 18వ తేదీన జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఆరోజు ఏడు స్టాండింగ్ కమిటీల సమావేశాలు ఉదయం 10.30గంటల నుండి నిర్వహించనున్నారు.

### వాకర్ వెంకటరత్నం

# మృతికి సంతాపం

వీఆర్సీ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ చర్మవ్యాధి నిపుణుడు చెరుకూరు భాస్కర్‌రావు తండ్రి చెరుకూరు వెంకటరత్నం(92) మృతికి వీఆర్సీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి ఈ నెల 14న ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.


ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# వైభవంగా ఇస్కాన్ వన సమారాధన



నెల్లూరు ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో ఈనెల 12వతేదీన కార్తీక వన సమారాధన వైభవంగా జరిగింది. ముత్తుకూరు రోడ్డులోని కాకుపల్లి తోటలో జరిగిన ఈ వేడుకకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇస్కాన్ మందిర అధ్యక్షులు డాక్టర్ సుఖదేవస్వామి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ, సుభద్ర, బలరామల విగ్రహాలను ఊరేగింపుగా తోటలోకి తీసుకెళ్ళారు. అక్కడ వాటిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుఖదేవస్వామి కార్తీకమాసం విశిష్టత, దీపోత్సవం, వనభోజనం ప్రత్యేకతను భక్తులకు వివరించారు. అనంతరం భజనలు, కార్తీక వనభోజనాలు జరిగాయి.

# విపిఆర్ విద్యలో బాలల దినోత్సవం



ఈ నెల 14వ తేదీన మాజీప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినోత్సవం సందర్భంగా నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న విపిఆర్ విద్య పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ ఆచార్య వి.నారాయణరెడ్డి నెహ్రూ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి పూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని, ఆయనకు చిన్నారులంటే ఎంతో ఇష్టమని, కాబట్టే ఆయన జన్మదినోత్సవాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. దేశానికి నెహ్రూ చేసిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖనం, వక్తృత్వ, డిబేట్, నృత్య పోటీలు నిర్వహించి బహుమతులందజేశారు.

# విజయ డెయిరీ వద్ద టిఎన్‌టియుసి ఆఫీసు

నెల్లూరులోని విజయ డెయిరీ వద్ద తెలుగుదేశంపార్టీ అనుబంధ కార్మిక సంస్థ టిఎన్‌టియుసి(తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. డెయిరీ మాజీ ఛైర్మెన్ ముప్పవరపు గోపాలకృష్ణయ్య చౌదరి సతీమణి స్వర్గీయ రామతులసమ్మ పేరు మీద నిర్మించిన ఈ కార్యాలయాన్ని 13వ తేదీన మాజీఎమ్మెల్యే, టీడీపీ నగర ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డిలు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ మాజీఛైర్మెన్ ఎం.గోపాలకృష్ణచౌదరి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు సుకుమార్, విజయ డెయిరీ యూనియన్ అధ్యక్షుడు రామలింగయ్య, డెయిరీ ఎం.డి కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# దక్షిణామూర్తి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో దక్షిణామూర్తి ఆలయ నిర్మాణానికి ఈ నెల 13వ తేదీన భూమి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రత్నం జయరామ్ ఆలయ నిర్మాణ ఉభయకర్త ఓడూరు సుధీర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

# నగరంలో విచ్చలవిడిగా గాడిద మాంసం

ఈమధ్య కాలంలో మాంసాహారులు మనుషులను తప్ప, మిగతా అన్ని జీవరాశులను లాగించేస్తున్నారు. మనకు నాన్‌వెజ్ అంటే మటన్, చికెన్, చేపలు, రొయ్యలు... ఇంకా లోతుకు వెళితే పీతలు, కముజులు, పంది... ఇటీవలకాలంలో దాని మాంసం తింటే యవ్వనం పెరుగుతుంది, దీని మాంసం తింటే శృంగార సామర్థ్యం పెరుగుతుందనే ప్రచారాలతో మట్టిపాములు, గాడిదల వంటి వాటిపై కూడా పడ్డారు. ఈమధ్య గుంటూరులో విచ్చలవిడిగా గాడిదల మాంస విక్రయాలు జరుగుతున్నట్లు మీడియాలో వార్తలొచ్చాయి. గాడిద మాంసం తింటే శరీరం గట్టి పడుతుందని, శృంగార సామర్థ్యం పెరుగుతుందనే ప్రచారంతో నగరంలోనే కొన్ని చోట్ల గాడిదలను వధించి వాటి మాంసాన్ని అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఆదివారాలలో మినీబైపాస్‌కు సమీపంలో కొండాయపాలెం రోడ్డు, బి.వి.నగర్ ప్రాంతాల్లో గాడిదలను వధిస్తున్నట్లు సమాచారం. కొనేవాళ్ళు కూడా పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

## విహారయాత్రలు...

# విషాదయాత్రలు కారాదు!



### కృష్ణా దుర్ఘటన పెద్ద గుణపాఠం

*ప్రతి మనిషికి ఆహ్లాదం, ఆనందం అవసరమే! అయితే ఆనందం కోసం చేసే ప్రయత్నం విషాదంగా మారడమే విచారకరం. పర్యాటక యాత్రలు సాహస యాత్రలుగా మారడం ప్రమాదకరం. మొన్న ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా నదిలో బోటు దుర్ఘటన ప్రతి ఒక్కరికీ గుణపాఠం కావాలి. ఈ దుర్ఘటనను చూసి ఎవరూ విహారయాత్రలు ఆపుకోనవసరం లేదు. కాకపోతే కనీస జాగ్రత్త చర్యలు లేకుండా బోటు ప్రయాణాలు ప్రమాదకరమని గ్రహించాలి.*

నెల్లూరుజిల్లాలోనూ 180 కిలోమీటర్ల మేర సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్రంలో చేపలు పట్టుకునే మత్స్యకారులకు సముద్రంలో ప్రయాణం సహజమే! కాని, మైపాడు, కొత్తకోడూరు, కాటేపల్లి, తుమ్మలపెంట వంటి బీచ్‌లకు వెళ్లే పర్యాటకులు అప్పుడప్పుడు నాటుపడవలెక్కి సముద్రంలో విహారానికి వెళుతుంటారు. ఈ బోటుల్లో ఎటువంటి లైఫ్ జాకెట్లు, రక్షణ చర్యలు వుండవు. బోటు నడిపే మత్స్యకారులు ఒకరిద్దరు వున్నా, ఊహించని ప్రమాదాలు జరిగినప్పుడు వాళ్ళు మాత్రం ఎంతమందినని రక్షించగలరు. ఎటువంటి రక్షణ ఏర్పాటు లేకుండానే బీచ్‌ల వద్ద పర్యాటకులు బోట్లు ఎక్కి వెళుతుండడాన్ని తక్షణం అడ్డుకోవాలి. అలాగే నెల్లూరు చెరువులోనూ బోటుషికారు వుంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. రక్షణ చర్యలు బాగానే వుంటున్నాయి. అయితే ఇక్కడున్న బోట్లలో తగినన్ని లైఫ్ జాకెట్లు లేవని తెలుస్తోంది. ఇక కండ్లేరు రిజర్వాయర్‌లోనూ ప్రైవేట్ వ్యక్తులు పర్యాటకులను ఎక్కించుకుని బోట్లను తిప్పుతున్నారు. చేపల వేట కోసం కొన్ని మోటారు బోట్లు వున్నాయి. గిరిజనులు చేపలవేటకు పుట్టీలు పెట్టుకుని వుంటారు. సెలవు దినాలలో వచ్చిన పర్యాటకులు వీటిని ఎక్కుతున్నారు. నాటుపడవలు, పుట్టీలను నడపడానికి అనుభవముండాలి. ఇవి బ్యాలెన్స్ తప్పితే తిరగబడతాయి. ఇలా పుట్టీలు నాటుపడవలలో వెళ్ళే కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. కాబట్టి సురక్షితం కాని జల షికారు కేంద్రాల వద్ద పడవ ప్రయాణాలను అరికట్టే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.



# మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

**- మంత్రి నారాయణ**



నెల్లూరుజిల్లాలోని నెల్లూరు, కావలి, గూడూరు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ నెల 11వ తేదీ నెల్లూరు మినీబైపాస్‌రోడ్డు గోమతినగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నెల్లూరు, కావలి, గూడూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఒకటి నుంచి 5వరకు చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న 15రోజుల్లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రతి తరగతికి బెంచీలు, గ్లాస్ బోర్డులు, ఎల్‌సిడి ప్రొజెక్టర్‌లను ఏర్పాటు చేయడం, పిల్లలకు గుణాత్మక విద్యను అందించేలా కృషి చేస్తాన్నారు. రానున్న మూడేళ్లలో దేశంలోనే మన రాష్ట్రం విద్య ప్రథమ స్థానంలో ఉండేలా చూస్తామని, నెల్లూరు నగరంలోనూ విద్యా ప్రమాణాలు పెంపొందిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆంజనేయరెడ్డి నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు, డి.ఇ.ఓ శ్యామ్యూల్, తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు ముప్పాళ్ళ విజేత, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

# హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు

**- నల్లపరెడ్డి ప్రసన్న ధ్వజం**

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసం చేస్తున్నారని వైఎస్సార్సీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి ధ్వజమెత్తారు. కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాడు తిప్పగిరిజన కాలనీలో ఈనెల 12న నిర్వహించిన రచ్చబండ-పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ముఖ్యమంత్రి తీరుపై విమర్శలు చేశారు. కోవూరు చక్కెర కర్మాగారాన్ని పున:ప్రారంభిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు, అధికారంలోకి వచ్చాక ఆ సంగతి పట్టించుకోవడం లేదని, ఈ ఫ్యాక్టరీ విషయమై 2014 నుంచి ఇప్పటిదాకా నాలుగు కమిటీలు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాయని, అయితే అందులోని అంశాలను మాత్రం అధికారపార్టీ నాయకులు బహిర్గతం చేయకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులకు 20.77 కోట్ల రూపాయలను చెల్లించాల్సి ఉందని, వాటిని చెల్లించకుండా ఉద్యోగుల కడుపు కొట్టడం తగదని ఆయన అన్నారు. చంద్రబాబుకు సిఎం కుర్చీపైన, కుమారునిపైన ఉన్న మక్కువ రాష్ట్ర ప్రజలపై లేదన్నారు. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసి కోట్ల రూపాయలను వెనకేసుకునేందుకు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్సీపి నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే 50 కోట్లను కేటాయించి కోవూరు చక్కెర కర్మాగారాన్ని పున:ప్రారంభింపజేయిస్తామన్నారు. విదేశాల్లో నల్లధనం దాచిపెట్టారంటూ జగన్మోహన్‌రెడ్డిపై టిడిపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆ ఆరోపణలను రుజువు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి నాయకులు నిరంజన్‌బాబురెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, శివుని నరసింహులురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నలబోలు సుబ్బారెడ్డి, గాజుల మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# జనవరిలో పక్షుల పండుగ



క్యాలెండర్ మారితే రాష్ట్రంలో అన్ని జిల్లాల వారికీ మొదటి పండుగ సంక్రాంతి. అయితే నెల్లూరుజిల్లా వాసులకు మాత్రం దానికంటే ముందొచ్చే పండుగ పక్షుల పండుగ. సూళ్లూరుపేట కేంద్రంగా నేలపట్టు విదేశీ పక్షుల కోసం జరిపే ఈ పండుగను 2000 సంవత్సరం ప్రాంతంలో కలెక్టర్‌గా వున్న కె.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. అప్పటి నుండి ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా ఈ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఈసారి జనవరి 7, 8, 9తేదీలలో పక్షుల పండుగ జరపాలని నిర్ణయించారు. దీని కోసం 3కోట్లు నిధులు విడుదల చేసినట్లు కూడా కలెక్టర్ ముత్యాలరాజు వెల్లడించారు.

# మా బాలయ్య బంగారం

స్వర్గీయ ఎన్టీఆర్ తనయుడు, ఆదర్శ రాజకీయ నాయకుడు నందమూరి బాలకృష్ణను నెల్లూరునగర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్ విమర్శించడం అర్థరహితమని టిడిపి నగర అధ్యక్షుడు నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు నగర ప్రజల సమస్యలను గాలికి వదిలి నిత్యం ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణ, నగర మేయర్ అజీజ్‌లను విమర్శించడం తప్ప అనిల్‌కు ఏం తెలియదని, అతనో టిట్ల ఎమ్మెల్యేగా మారాడని కోటంరెడ్డి ఎద్దేవా చేశారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా బాలకృష్ణ ఎంతోమందికి వైద్యం అందిస్తున్నారన్నారు. గతేడాది ప్రభుత్వ హాస్టళ్ళలో చదువుకుంటున్న వేలాదిమంది విద్యార్థులకు దుప్పట్లు అందజేశారని, సారా ఉద్యమ నాయకురాలు దూబగుంట రోశమ్మ మరణిస్తే రూ.50వేల ఆర్థిక సాయం, జిల్లాలో ఎవరైనా అభిమానుల ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు అవుతుంటే వారికి ఆర్థిక సాయం అందిస్తున్నారని, అలాంటి వ్యక్తిపై విమర్శలు చేయడం దారుణమన్నారు. నెల్లూరులో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పనుల్లో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే తన సెల్ నెం.9959954199లో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్.కె.టి. శేషయ్య, పడవల కృష్ణమూర్తి, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, మొయినుద్దీన్, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు.



# 'సర్వోదయ'కు ఛాంపియన్‌షిప్

- పురుషుల విభాగంలో కావలి జెబి కళాశాల విజేత
- ముగిసిన వియస్‌యు అథ్లెటిక్ మీట్
- విఆర్‌సి జట్టుకు పతకాల పంట



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన మహిళా అథ్లెటిక్ పోటీల్లో నగరంలోని శ్రీ సర్వోదయ కళాశాల జట్టు ఛాంపియన్‌షిప్‌ను సాధించింది. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుష, మహిళల అథ్లెటిక్ పోటీలు రెండురోజుల పాటు ఇక్కడ ఎంతో సందడిగా జరిగాయి. ఈనెల 12తో పోటీలు ముగిశాయి. మహిళా విభాగంలో 76 పాయింట్లతో సర్వోదయ కళాశాల ఛాంపియన్‌షిప్‌ను సాధించగా, నగరంలోని డికెడబ్ల్యు కళాశాల విద్యార్ధిని ఎం.సుప్రియ 23 పాయింట్లతో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ సాధించింది. అదేవిధంగా పురుషుల విభాగంలో కావలి జవహర్‌భారతి డిగ్రీ కళాశాల జట్టు 90 పాయింట్లతో టీమ్ ఛాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకోగా, అదే కళాశాల విద్యార్ధి యు.ప్రదీప్‌కుమార్ 23 పాయింట్లతో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను సాధించాడు. పోటీల అనంతరం శ్రీ సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.శ్రీనివాసులు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సివి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

*ప్రతిభ చూపిన విఆర్‌సి జట్టు :* ఇదే పోటీల్లో పాల్గొన్న విఆర్‌సి జట్టుకు 12 పతకాలు లభించాయని విఆర్‌సి పి.డి ఎం.రవీంద్రబాబు తెలిపారు. 800 మీటర్లు, 1500 మీటర్ల పరుగుపందెంలో ఎన్.విజయకుమార్ ప్రథమస్థానం సాధించాడని, 800, 400 మీటర్ల హర్డిల్స్‌లో ఎన్.నరసింహ ద్వితీయస్థానం కైవశం చేసుకున్నాడని తెలిపారు. అదేవిధంగా, ఏ.విజయ్ 5 కిలోమీటర్ల పరుగులో ప్రథమస్థానం 1500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం సాధించాడన్నారు. 100 మీటర్ల రిలే పరుగులోనూ ఏ.విజయ్ ప్రథమస్థానం సాధించాడని తెలిపారు. 100, 110 మీటర్ల పరుగుపందెంలో వై.ప్రశాంత్ తృతీయస్థానంతో పాటు, 400 మీటర్లు, 400 మీటర్ల హర్డిల్స్‌లోనూ తృతీయ స్థానం సాధించాడన్నారు. అథ్లెటిక్స్‌లో ప్రతిభచూపి పతకాలు సాధించిన ఈ క్రీడాకారులను విఆర్‌సి ప్రిన్సిపాల్ డా.సివిఎస్ భాస్కర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్‌రావు అభినందించారు.

# అక్రమార్కులపై ఉక్కు 'పిడి'కిలి

### - డిఎస్పీ రాంబాబు



ఎర్రచందనం నిందితుల వివరాలు తెలుపుతున్న డిఎస్పీ రాంబాబు

ఎర్రచందనం, సిలికా అక్రమంగా తరలించేవారిపై ఉక్కుపాదం మోపి పి.డి యాక్టు నమోదు చేస్తామని గూడూరు డిఎస్పీ రాంబాబు తెలిపారు. గూడూరు పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో ఇటీవల ఎర్రచందనం, సిలికా అక్రమ రవాణాలో ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి ఓఎస్డీ విఠలేశ్వర్ సహకారంతో వెంకటగిరి ఇన్‌ఛార్జి సిఐ సుబ్బారావు, వెంకటగిరి ఎస్.ఐ కేకేనాయుడు తదితరులు ఎర్రచందనం అక్రమ రవాణాకు సిద్ధం అవుతున్నట్లు వచ్చిన సమాచారంతో 10వ తేదీ రాత్రి ఏడు గంటల ప్రాంతంలో వెంకటగిరి సమీపంలో వల్లిపేడు అడ్డరోడ్డు వద్ద చెన్నై వెళుతున్న పాత నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. పలు కేసుల్లో నిందితులుగా వున్న దక్కిలి మండలం తీర్థంపాడుకు చెందిన కారు వేమయ్య, పేట్లూరు గురవారెడ్డి, వెంకటగిరి మండలం పారవోలు గ్రామానికి చెందిన తుమ్మల కొండయ్య, దక్కిలి మండలం పనుగోటి వరంధామయ్య నాయుడు, వెంకటగిరి మండలం కుర్జాగుంటకు చెందిన రంగినేని జనార్ధన్ నాయుడులను విచారించగా అక్రమంగా అటవీ ప్రాంతంలో ఉన్న ఎర్రచందనాన్ని తరలిస్తున్నట్లు చెప్పారన్నారు. నిందితులు ఐదుగురిపై జిల్లాలోని వెంకటగిరి, దక్కిలి, ఓజిలి, డి.వి.సత్రం, ఆత్మకూరు, రాపూరు, దుత్తలూరు, ఎస్ఆర్ పురం, మర్రిపాడు, వింజమూరు, కలువాయి, అనంతసాగరం తదితర ప్రాంతాల్లో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు కేసులు సైతం ఉన్నట్లు డిఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎస్సై కేకే నాయుడు, సిబ్బంది ఉన్నారు. కాగా, చిల్లకూరు మండలం చింతవరం ప్రాంతంలో ప్రత్యేకంగా సిలికా అక్రమ రవాణా నివారణ చెక్‌పోస్టు వద్ద చిల్లకూరు ఎస్సై శ్రీనివాసరావు ఇటీవల తనిఖీలు నిర్వహిస్తుండగా పత్రాలు లేకుండా, అధిక సామర్ధ్యంతో చెన్నైకు తరలిస్తున్న రెండు సిలికా లారీలతో పాటు మరో ఇద్దరు దిలీప్ బాషా, మునుస్వామిలను అరెస్టు చేసినట్లు డిఎస్పీ రాంబాబు తెలిపారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# ప్రభుత్వ వైద్యాన్ని ఉపయోగించుకోండి

### - ఎమ్మెల్యే సునీల్



రక్త సేకరణ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్, ఆసుపత్రి ఛైర్మెన్ జ్యోత్స్నలత

గూడూరు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో జాతీయ ఆరోగ్యమిషన్ ఆధ్వర్యంలో మంజూరైన రక్తసేకరణ వాహనాన్ని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ డాక్టర్ జ్యోత్స్నలతతో పాటు ఇటీవల ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు ఏరియా ఆసుపత్రిలో ఉన్న వైద్య సేవలు డివిజన్ పరిధిలో ఎక్కడాలేవని, ప్రతిఒక్కరూ కూడా ఉపయోగించు కోవాలని సూచించారు. డయాలసిస్ విభాగం, సిటి స్కాన్ వంటి ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉండడం సంతోషకరమని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో అందిస్తున్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆసుపత్రి అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. అభివృద్ధి కమిటీ సభ్యులు చెంచురెడ్డి, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ దయాకర్‌రావు, ఆర్ఎంఓ శైలజ, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు

### ------------------------ ఆర్డీవో అరుణ్‌బాబు



ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో అరుణ్‌బాబు తెలిపారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను ఆర్డీవోకు అందించారు. పెండింగ్‌లో వున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. భూసమస్యలు, ఇళ్ళ స్థలాలు తదితర సమస్యలు అధికంగా వచ్చినట్లు తెలిపారు.

## బాలసదన్‌లో...

# యరగుడిపాటి వేదవతి 85వ జయంతి



గూడూరు నరసింగరావుపేటలోని బాలసదన్‌లో కీ.శే. యరగుడిపాటి వేదవతి 85వ జయంతిని మంగళవారం పిల్లల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. పై సభలో ఆమె కుమారుడు, సీనియర్ న్యాయవాది, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు మాట్లాడుతూ తమ తల్లి యొక్క ఆశీర్వాదంతో ఇంతటివాడినైనానని, ఇక్కడకు విచ్చేసిన అందరికి అమ్మ ఆశీర్వాదం ఉంటుందన్నారు. బాలసదన్‌లోని పిల్లలకు స్వెట్టర్లు, చెప్పులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు అనిమెళ్ళ శివకుమార్, లయన్ నవీన్ జయకుమార్, న్యాయవాదులు ఎన్.వెంగళరెడ్డి, కె.రజనీకాంత్‌రెడ్డి, బాలసదన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, గీతా, శిరీష, సుహాసిని, సరస్వతి, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయసేవలను పొందండి




మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి

ప్రజలు న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయసేవలను వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి తెలిపారు. గూడూరు పట్టణంలోని గడియారపు స్థంభం కూడలి వద్ద సోమవారం మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలందరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వివరించి, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు రవికుమార్, చంద్రహాస్, అరవ పార్వతయ్య, డాక్టర్ సుగుణమ్మ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# సిద్దారెడ్డికి మండల కాంగ్రెస్ బాధ్యతలు



సిద్దారెడ్డిని అభినందిస్తున్న డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య

కాంగ్రెస్‌పార్టీ గూడూరు మండల అధ్యక్షుడిగా గూడూరు మండలం తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన మందపాటి సిద్దారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య తెలిపారు. గూడూరు పట్టణ ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆదివారం గూడూరు మండల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఇప్పటివరకు మండల అధ్యక్షుడిగా వున్న వెంకటకృష్ణారెడ్డి ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరడంతో తాజాగా ఈ నియామకం జరిగింది. సిద్దారెడ్డి నియామకంతో పలువురు నాయకులు ఆయన్ను పూలమాలలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో బాబురెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రవి, శ్రీనివాసులు, శరత్, మండల నాయకులు ఉన్నారు.

# పాదయాత్ర ప్లాన్‌తో బాబుకు షాకిచ్చిన లోకేష్

శ్రీను గల్పిక

'జగనన్నా జగనన్నా మీ వెంటే మేమన్నా... రాజన్న పుత్రుడవు, రైతన్న మిత్రుడవు' అనే పాట బ్యాక్‌గ్రౌండ్‌తో సాగుతున్న జగన్ పాదయాత్రను ఉండవల్లిలోని తన ఇంట్లో కూర్చుని 'ఆత్మసాక్షి' ఛానెల్‌లో చూస్తున్నాడు నవ్యాంధ్రసారథి, హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు. జమ్మలమడుగు ప్రాంతంలో పాదయాత్ర జరుగుతోంది. జనం పోటెత్తినట్లు వచ్చారు. అటు ఆదినారాయణరెడ్డి, ఇటు రామసుబ్బారెడ్డిలు తన పార్టీలోనే వున్నా జగన్ కోసం అంతమంది జనం రావడం చూసి చంద్రబాబు బిత్తరపోయాడు. వెంటనే మంత్రి ఆదినారాయణరెడ్డికి ఫోన్ చేశాడు. ఆదినారాయణరెడ్డి ఫోన్ ఎత్తగానే... నీ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో చూస్తున్నావా? అని ప్రశ్నించాడు. అందుకు ఆదినారాయణరెడ్డి... నా నియోజకవర్గంలో జరిగేదేముంది... పగలు ఎండకాస్తోంది, రాత్రయితే చీకటి పడుతోంది... అప్పుడప్పుడూ మబ్బు కాస్తే వర్షం పడుతోంది. ఎక్కడైనా ఇదేగా జరిగేది అని చెప్పాడు. వెంటనే టీవీ ఆన్‌చేసి చూడు... నీ నియోజకవర్గంలో జగన్ పాదయాత్రకు ఎంతమంది జనం వచ్చారో! మీరిద్దరు వుండి కూడా అంతమంది జనం అక్కడకు వెళ్లడమేంటని చంద్రబాబు అడిగాడు. అందుకాయన... జనానికి, ఓట్లకు సంబంధం లేదు సీఎం గారు... మొన్న నంద్యాలలో కూడా జగన్ వస్తే ఇసుకేస్తే రాలనంతగా జనం వచ్చారు. మీరొస్తే ఈగలు తోలుకుంటున్నాం, అంతమాత్రం చేత ఓట్లు వాళ్లకు పడ్డాయా? మనకు పడ్డాయా? ఓట్ల లెక్కకు పాదయాత్ర జనం లెక్కకు సంబంధం లేదప్పా... వాళ్ళంతా పెళ్ళిళ్ళకు వచ్చిన జనం... మా ఊర్లో చేదమ్మ తల్లి జాతరకు కూడా జనం బ్రహ్మాండంగా వస్తారు, అలాగని ఎన్నికల్లో ఆ చేదమ్మ తల్లి వచ్చి పోటీ చేసినా డబ్బులియ్యందే ఓట్లేయరు, మీరేం వర్రీకాకండి, ఎన్నికలంతా లెక్కాచారంతోనే జరిగిపోతాయని చెప్పి పెట్టేశాడు. ఆదినారాయణరెడ్డి మాటతో చంద్రబాబు మనసు కుదుటపడలేదు. 'ఆత్మసాక్షి' ఛానెల్‌లో జగన్‌కు వస్తున్న జనాన్ని చూస్తూ అన్యమనస్కంగానే వున్నాడు. దీనికితోడు అప్పుడే పాదయాత్రలో చిన్న విరామం అంటూ న్యూస్ రీడర్ చెప్పాడు. వెంటనే వాణిజ్య ప్రకటనలు... "వేల కిలోమీటర్ల నడక... నేలపైనే పడక... ఎన్ని వందల కిలోమీటర్లు నడిచినా పాదాలకు నొప్పులు తెలియవు... జగన్ పాదయాత్రలో అద్భుత రహస్యం... ఆడిడాస్ బూట్లు... మీరూ కొనండి... పాదయాత్ర చేయండి" అంటూ ఒక యాడ్... అది అయిపోగానే... "రామ్‌రాజ్ బనియన్లు, డ్రాయర్లు... నాడు రాజశేఖరరెడ్డి నుండి నేడు జగన్మోహన్‌రెడ్డి దాకా పాదయాత్రకు అందరూ వాడే డ్రాయర్లు... మీరెక్కడ నడుస్తున్నా రామ్‌రాజ్ డ్రాయర్ మీ వెంటే" అంటూ ఇంకో యాడ్. వీటిని చూడగానే చంద్రబాబుకు చిర్రెత్తుకొచ్చింది. దాంతో పాటే జగన్ పాదయాత్రను ఆపే ఐడియా కూడా వచ్చింది. వెంటనే ఆరోగ్యమంత్రి కామినేని శ్రీనివాస్‌ను పిలిపించాడు. ఆయనకు చెవిలో ఏదో వూదాడు.

★★★★★

జగన్ పాదయాత్ర జమ్మలమడుగు వైపు నుండి పొద్దుటూరు రోడ్డులో రాసాగింది. ఆ రోడ్డు పొడవునా ఆంధ్రప్రభుత్వ వైద్యఆరోగ్య మంత్రిత్వశాఖ వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ హోర్డింగ్‌లు... వాటిపై ఇలా వ్రాసి వుంది. "అతి నడక అనర్ధదాయకం... ఎక్కువ దూరం నడిస్తే మోకాళ్ళ చిప్పలు అరిగి కీళ్ళ వాతం వచ్చి, ఎముకలు చచ్చుబడిపోవచ్చు. పాదయాత్రలు మానుకోండి.. మీ కాళ్ళను కాపాడుకోండి."

ఇట్లు
మీ ఆరోగ్యం కోసం తపించే...
ఆరోగ్యశాఖ మంత్రి
కామినేని శ్రీనివాస్...

దారి పొడవునా ఇవే హోర్డింగ్‌లు. ఆ హోర్డింగ్‌ల మీద వ్రాసిన మెసేజ్ చదివి జగన్ నవ్వుకున్నాడు. తన పాదయాత్రకు బ్రేక్ వేయడానికి చంద్రబాబు వేసిన ప్లాన్ అని గ్రహించాడు. వెంటనే తన సెల్‌ఫోన్ తీసి ఒక మెసేజ్ టైప్ చేసి ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఫోన్‌కు పోస్ట్ చేసాడు.

★★★★★

చంద్రబాబు ఛాంబర్‌లో ఆయనతో పాటు మంత్రులు కామినేని శ్రీనివాస్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, పి.నారాయణ, దేవినేని ఉమలు వున్నారు. మనం పెట్టిన హోర్డింగ్‌లు చూసి ఆ జగన్ భయపడతాడా? పాదయాత్ర ఆపుతాడా? అని చంద్రబాబు అనుమానంగా అడిగాడు. ఖచ్చితంగా వర్కవుట్ అవుతుంది సార్, అంత భయపెట్టేలా హోర్డింగ్‌లు రాయించానని కామినేని శ్రీనివాస్ చెప్పాడు. అప్పుడే తన సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో కామినేని దానిని ఓపెన్ చేసి చూసాడు.

"కాలు కదిలితే కొవ్వు కరుగుతుంది...
కాలు పరుగెడితే గుండె స్పీడవుతుంది...
కాలు ముందుకు పడితే షుగర్ వెనకడుగు వేస్తుంది...
కాలు కదం తొక్కితే బి.పి. పరారవుతుంది...
మీ హోర్డింగ్‌ల మీద వీటిని వ్రాయించండి.

ఇట్లు
మీ,
జగన్.

ఆ మెసేజ్ చూడగానే కామినేని బిత్తరపోయాడు. ఇతని పాదయాత్రను ఆపేదెట్లా అని చంద్రబాబు దిగులుపడ్డాడు. అప్పుడే ఐ.టి మంత్రి లోకేష్ అక్కడకు వచ్చాడు. విచారంగా వున్న తన తండ్రిని చూసి విషయం ఏంటని అడిగాడు. పక్కనే వున్న దేవినేని... ఏం చెప్పమంటావు బాబూ... జగన్ పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి మీ తండ్రిగారిలో నరాలు ఎక్కువుగా స్పందిస్తున్నాయి. ఆయనేమో ముఖ్యమంత్రి, పాదయాత్ర చేయకూడదు... 2002లో వై.యస్. పాదయాత్ర చేసాడు, సీఎం అయ్యాడు. 2013లో మీ నాన్నగారు పాదయాత్ర చేసారు, సీఎం అయ్యారు. ఇప్పుడు ఆ జగన్ పాదయాత్ర చేస్తున్నాడు... అదే మీ నాన్నగారి బెంగ అని చెప్పాడు. అది విన్న లోకేష్.. ముళ్ళును ముళ్ళుతోనే తీయాలి, వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి, పాదయాత్రను పాదయాత్రతోనే కొడతాను, అతనికంటే ఎక్కువ కిలోమీటర్ల దూరం నడిచి శెభాష్ అనిపించుకుంటాను... ఇదే నా శపథం అంటూ తొడ చరిచాడు. లోకేష్ ఉత్సాహం చూసి చంద్రబాబుతో పాటూ మంత్రులందరిలోనూ ఎక్కడా లేని ఉత్సాహం వచ్చింది. వెంటనే లోకేష్‌కు బట్టలు సర్ది, నాలుగు జతల బూట్లు పెట్టి రెడీచేసి బండెక్కించి పంపారు. చంద్రబాబు రాత్రి రెండు పుల్కాలు తిని లోకేష్ నా వరాల పుత్రుడు.. పాదయాత్ర చేస్తానని చెప్పి నా గుండెల్లో వున్న భారం దించాడు. జగన్‌కన్నా ఎక్కువ దూరం పాదయాత్ర చేస్తానన్నాడు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు తిరుగుతాడేమో నా బంగారు కొండ అని మురిసిపోతూ... సుమతి శతకం తీసి

"పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా
పుత్రుని గనుగొని పొగడగ
బుత్రోత్సాహంబునాడు పుట్టును సుమతి"
అనే పద్యం చదువుకుని ప్రశాంతంగా నిద్రపోయాడు.

★★★★★

తెల్లారింది. చంద్రబాబు లేచి రోజువారీ కార్యక్రమాలు ముగించుకుని హాల్‌లోకొచ్చి టీవీ ఆన్ చేసి కూర్చున్నాడు. లోకేష్ వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని తిరుపతి నుండి పాదయాత్ర మొదలు పెడతాడేమోనని చంద్రబాబు ఆలోచించసాగాడు. అప్పుడే న్యూస్ ఛానెల్ 'చంద్రజ్యోతి'లో బ్రేకింగ్ న్యూస్... కాశ్మీర్ నుండి కన్యాకుమారికి పాదయాత్రను మొదలుపెట్టిన నారా లోకేష్... కాశ్మీర్‌లో పాదయాత్రను ప్రారంభించిన కాశ్మీర్ సీఎం మెహబూబా మఫ్తీసయ్యద్.. అని న్యూస్‌రీడర్ చెప్పగానే... జగన్ కంటే ఎక్కువ దూరం పాదయాత్ర చేస్తానంటే ఇదా... అని చంద్రబాబు అలాగే షాక్‌కు గురై కుర్చీలో కూలబడ్డాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక స్థితి బాగుండి వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆదాయం తృప్తికరం. ఉద్యోగ ప్రయత్నాలు చేసుకొనేవారికి మంచి సమయమిది. అనుకున్న పనులు సక్రమంగా సాగుతాయి. అవసరాలకు కొద్దిపాటి ఋణం చేస్తారు. కుటుంబసభ్యుల సహకారం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడటం మంచిది. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటారు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులుంటాయి. దూర ప్రయాణాలుంటాయి. శుభకార్యాలలో, సభలు సమావేశాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం బాగుంటుంది. బిడ్డల విద్య ఆరోగ్య ఉద్యోగ వ్యవహారాలలో దృష్టి పెడతారు. పరిచయాలు కొత్తవి జరిగి ప్రయోజనం నెరవేరేందుకు ఉపయోగపడతాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగుతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

అనుకున్న పనులను శ్రమపడి పూర్తి చేస్తారు. వృత్తి జీవనంలో అభివృద్ధి ఉండి ఆదాయం బాగుంటుంది. వ్యాపారవర్గాలకు మాత్రం స్వల్ప ఇబ్బందులుంటాయి. ఆదాయం సామాన్యము. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తగా ఉండండి. మొగమాటాలకు పోవద్దు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారాలలో అభివృద్ధిని గూర్చి సమీక్ష చేసి, కొత్త ప్రయత్నాలు చేపడుతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. ప్రారంభించి చేస్తున్న పనులను విజయవంతంగా నెరవేర్చుతారు. నూతన వస్తు ప్రాప్తి, ప్రముఖుల పరిచయాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూల పరిణామాలుంటాయి. బంధుమిత్రుల సలహాలు మేలు చేకూర్చుతుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఈ రాశి వారికి ఆర్థికావకాశాలు బాగుంటాయి. సమాజంలో గుర్తింపు గౌరవాలుంటాయి. సమస్యలను ఇబ్బందులను ఎదుర్కొంటారు. మాటలందు చేతలందు దూకుడు తగ్గించుకొనాలి. ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. స్థిరాస్తులు కొనే అవకాశాలుంటాయి. సోదర వర్గానికి అభివృద్ధి ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులను పట్టుదలగా నెరవేర్చుతారు. ఆర్థిక ఉద్యోగ రంగాలపై వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ అనుకూలత, బ్యాంకు ఋణాలు పొందుతారు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయం కావచ్చు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుపుతారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 17.11.2017 నుండి
తేది. 23.11.2017 వరకు

ఈ వారం కర్కాటకంలో రాహువు, కన్యలో కుజుడు, తులలో గురు శుక్రులు, వృశ్చికంలో రవిబుధులు, ధనుస్సులో శని, మకరంలో కేతువు, తుల వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము**

తేది 23 గురువారం ఉదయం గంట 3.46 నుండి గంట 5.52లోగా తులా లగ్నమున వివాహ గృహారంభ, గృహప్రవేశములు.

**కార్తీక మాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | శుక్ర | చతుర్దశి | ప॥ గం.2.50వ॥ |
| తేది. 18 | శని | అమావాస్య | సా॥ గం.3.50వ॥ |

**మార్గశీర్ష మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | ఆది | పాడ్యమి | సా॥ గం.5.25వ॥ |
| తేది. 20 | సోమ | విదియ | రా॥ గం.7.20వ॥ |
| తేది. 21 | మంగళ | తదియ | రా॥ గం. 9.28వ॥ |
| తేది. 22 | బుధ | చతుర్థి | రా॥ గం.11.36వ॥ |
| తేది. 23 | గురు | పంచమి | రా॥ గం.1.34వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలు బాగా వృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది. అయినా వ్యాపారవృద్ధికి గాని, ఇతర అవసరాలకు గాని ఋణం కొంత చేయవలసి వస్తుంది. సోదరులతో విభేదాలు వచ్చే అవకాశం ఉన్నది. స్థిరాస్తుల లావాదేవీల విషయంలో తొందర వద్దు. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారుల పర్యవేక్షణ ఎక్కువగా ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ఇబ్బందులు పెరుగుతాయి. ఖర్చులను అదుపు చేసికొనవలెను. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. వస్తు నష్టం, వస్తు వాహన రిపేర్ల ఖర్చులు ఎక్కువుగా ఉంటాయి. వృత్తి పరంగా బాగుండి రాబడి ఉంటుంది. వ్యాపారపరంగా సామాన్యంగా ఉంటుంది. చెల్లింపులు వాయిదా పడతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపారవృద్ధి అవకాశాలు లభించకపోవచ్చును. ఆదాయం వ్యాపారవర్గాలకు సామాన్యంగా ఉంటుంది. వృత్తి పరంగా ఆదాయం తృప్తికరం. ముఖ్య బంధువుల నుండి అనారోగ్య వార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలలో శ్రద్ధ చూపుతారు. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఉద్యోగులకు పని సామర్ధ్యం బాగుండినా, బాధ్యతలు, వత్తిడి పెరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. అందరిని అనుమానించవలసిన పరిస్థితులుంటాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. కొత్త వస్తువులను సమకూర్చుకొంటారు. కుటుంబంలో కొద్దిపాటి భేదాభిప్రాయాలుండి సర్దుకుంటాయి. వత్తిళ్ళకు, మొగమాటాలకు లొంగవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభిస్తాయి. లీజులు పొందుతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వాహనాలు నడిపేటప్పుడు, యంత్రాలు కరెంటు పనులందు జాగ్రత్త అవసరం. గాయాలు తగలవచ్చును. ఉద్యోగులకు సమర్ధత, గుర్తింపు గౌరవాలుంటాయి. ప్రయాణాలు తప్పనిసరి. శుభకార్యాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు, అభివృద్ధి ఉంటుంది. వ్యాపారములందు వృత్తిలో ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

నిర్ణయాలు తీసికొనడం, అమలు పరచడంను కట్టుదిట్టంగా జరుపుతారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు బాగుంటాయి కాబట్టి ప్రయత్నించాలి. విద్య, పరిశోధన రంగాలలో మంచి ప్రగతి చూపుతారు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. బంధువుల నుండి సహాయసహకారాలు బాగుంటాయి.

# కార్తీక దీపాలతో శోభిల్లిన ఆలయాలు

## ఈ నెల 18వ తేదీతో ముగియనున్న పవిత్ర కార్తీక మాసం




కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని ఆలయాలు కార్తీక దీపకాంతులతో ప్రకాశమానమయ్యాయి. నెల్లూరు జిల్లాలో వున్న ఉన్న ఆలయాలు కార్తీక దీప కాంతుల శోభతో అలరారాయి. ప్రత్యేకించి ఈనెల13న నాల్గవ సోమవారం కనుక, ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కార్తీక దీపాల వెలుగులతో ఆలయాలు కళకళ లాడాయి. నగరంలోని శైవక్షేత్రాల్లో భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి కార్తీక దీపాలను వెలిగించారు. మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయ అర్చకులు స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో విచ్చేసి కార్తీకదీపాలు వెలిగించారు. సాయంత్రం ఆకాశదీపోత్సవం ఎంతో వేడుకగా జరిగింది. ఆలయంలో అఖండ శివపంచాక్షరీ జపాలు, భజనలతో ఆలయప్రాంగణం మార్మోగింది. దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఇ.ఓ పాయసం నాగేశ్వరరావు ధర్మకర్తలు మాణికల సునీల్, గంగుల జనార్ధనయాదవ్, మద్దిన విశ్వనాథ్, ఎం.వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలోను, పెద్దబజారు శివాలయంలోను, సంతపేట శివాలయంలోను, నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం లోను కార్తీక మాస పూజలను ఎంతో నిష్టగా నిర్వహించారు. ఈ నెలంతా కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయాలలో శివనామస్మరణ మారుమోగింది. ఇక జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రాలైన జొన్నవాడలోని కామాక్షితాయి సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం, గండవరం, ముదివర్తి, సిద్ధలయ్యకోన, మల్లాంకొండ, సంగం తదితర దేవాలయాలలో కార్తీకమాస పూజలు వైభవోపేతంగా జరిగాయి.

# ముగిసిన మాలధారణ దీక్షలు



నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులు చేపట్టిన శివదీక్షలు ఈ నెల 17వ తేదీతో ముగిశాయి. గత నెల 20వ తేదీన దాదాపు 260మంది భక్తులు శివదీక్ష పూనారు. ఈ భక్తులందరికీ ఆల్తూరు గిరీష్‌రెడ్డి దాతృత్వంలోనే ఉచిత వస్త్రాలు, మాలలు, ప్రతిరోజూ అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది. ఇన్ని రోజుల పాటు ఎంతో నిష్టతో దీక్ష చేసిన భక్తులు ఈ నెల 16వ తేదీన రంగనాయకుల స్వామి దేవస్థానం నుండి ఇరుముడులు కట్టుకుని ప్రదర్శనగా మూలస్థానేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకున్నారు. ఆలయంలో పూజలు, భజనలు నిర్వహించారు. 17వ తేదీ ఉదయం అర్చకుల వేదమంత్రాలతో దీక్షలు ఉపసంహరించారు. ఆలయ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఇ.ఓ పాయశం సుబ్రహ్మణ్యం మరియు ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## కాలధర్మం

# ఆనం వెంకటరమణమ్మ



మాజీ మంత్రి స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి సతీమణి శ్రీమతి ఆనం వెంకటరమణమ్మ(98) ఈ నెల 15వ తేదీ బుధవారం స్వర్గస్తురాలైనారు. గత కొన్నిరోజులుగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న ఆమె, నెల్లూరులోని సింహపురి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకుమారుడు ఆనం వివేకానందరెడ్డి నెల్లూరు మున్సిపల్ ఛైర్మెన్‌గా మూడుసార్లు, శాసనసభ్యుడిగా పనిచేసి ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. రెండవ కుమారుడు మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్రప్రజలందరికీ సుపరిచితుడే. కవల సోదరులైన ఆనం జయకుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలోను, ఆనం విజయకుమార్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగాను ఉన్నారు. ఆనం వెంకటరమణమ్మ మరణవార్త వినగానే రాష్ట్ర స్థాయిలో వివిధ రాజకీయ ప్రముఖులే కాక, జిల్లాలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్దసంఖ్యలో ఆనం అభిమానులు వారి ఇంటికి చేరుకుని ఆమె మృతిపట్ల సంతాపం ప్రకటించారు. మోడ్రన్ ఐ హాస్పిటల్ వైద్య బృందం వచ్చి ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా మానవత్వంతో ఆమె నేత్రదానానికి ముందుకు వచ్చిన ఆమె తనయులు ఆనం సోదరులను డాక్టర్ పి.ఎల్.రావు అభినందించారు. 16వ తేదీన జరిగిన అంత్యక్రియలకు పెద్దసంఖ్యలో ఆనం అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. తల్లి అంటే ఈ నలుగురు కొడుకులకు ఎంతో ప్రేమ. తమ తల్లి మరణవార్త వినగానే నలుగురూ విషాదానికి లోనయ్యారు. ఆనం వెంకటరమణమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## గూడూరు బ్రాహ్మణ భవన్‌కు చలపతిరావు విరాళం



గూడూరులో నిర్మించనున్న బ్రాహ్మణ భవన్‌కు 25వేల రూపాయలు మొదటి విడతగా బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు తన తల్లి దండ్రులు బ్రాహ్మణ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వై.రామారావు – వేదవతిల జ్ఞాపకార్థం విరాళంగా అందజేశారు. గౌరవాధ్యక్షుడు ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు తన అన్న నాగ రాజారావు జ్ఞాపకార్థం భవన నిర్మాణానికి గాను రూ.50వేలు విరాళం ఇచ్చినట్లు, సంఘ ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ రూ.10,116లు, సంఘ సభ్యుడు జి.శ్రీనివాసకుమార్ రూ.10వేలు బ్రాహ్మణ భవన నిర్మాణానికి ఇచ్చినట్లు సంఘ అధ్యక్షుడు వై.చలపతిరావు ప్రకటించారు. శరవేగంగా దాతల సహకారంతో బ్రాహ్మణ భవన్ నిర్మాణం జరుగుతున్నట్లు ఆయన తెలిపారు.

# 23న శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ



నెల్లూరు సంతపేటలోని శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం శ్రీ ఆంజనేయస్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. నూతనంగా పునఃనిర్మించబడిన దేవాలయంలో శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ మధ్వాచార్య మూల సంస్థాన శ్రీ ఉత్తరాది మఠాధీశులైన పరమపూజ్య శ్రీశ్రీశ్రీ 1008 శ్రీ సత్యాత్మతీర్థుల వారి అమృత హస్తముచే గణపతి, దుర్గాదేవి, సుబ్రహ్మణ్య, నవగ్రహ, శ్రీ ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకాలు జరుగనున్నాయి. 22 నుండి 23వ తేదీ వరకు పంచాహ్నిక యాగశాల పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులు శ్రీ స్వామి వారి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని శ్రీ స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ ఆంజనేయస్వామి వారి అనుగ్రహం పొందాలని ఆలయ ఛైర్మెన్ డివియస్ గిరి, కార్యనిర్వహణాధికారి జి.రామకృష్ణ, పాలకమండలి సభ్యులు బి.రఘుపతి, ఐ.సిద్దయ్య, టి.సాయిశ్రీనివాస్, డి.రేవతి, టి.అచ్యుతరావులు కోరుతున్నారు.

# పేదలకు, వృద్ధులకు దుప్పట్లు



నెల్లూరు నగరం మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురు నిలయం భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో ఈ నెల 16వ తేదీ మాకాని వెంకట్రావు ఆధ్వర్యంలో నిరుపేదలకు, వృద్ధులకు, అనాథలకు దాదాపు రెండు వేల మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం విధిగా జరుగుతున్న శీతాకాలం దుప్పట్లు పంపిణీ కార్యక్రమం యధావిధిగా ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



## కావలి కబుర్లు

# వార్డు సమావేశాలను తప్పక నిర్వహించాలి




కావలి పట్టణంలోని ప్రతివార్డులో ప్రతి నెల 9వ తేదీన వార్డు టిడిపి సమావేశాలను తప్పక నిర్వహించి, ప్రజల సమస్యలను పొందుపరచి ఆ నివేదికను తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి తప్పనిసరిగా అందజేయాలని కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఆ మేరకు కావలి టిడిపి అధ్యక్షుడు అమరా వేదగిరి సుబ్బరాయుడుగుప్తా అధ్యక్షత్వంలో ఈ నెల 14న జరిగిన సమావేశంలో తీర్మానించారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో మిగిలిన వార్డులను త్వరితగతిన పూర్తిచేయాలని, వార్డు నాయకులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని తీర్మానించారు. అదేవిధంగా ప్రతి నెల 14న జరిగే కావలి పట్టణ టిడిపి సమావేశానికి ఎక్కువ సంఖ్యలో నాయకులు హాజరై, వార్డు సమస్యలను, అభివృద్ధి కార్యక్రమాలను చర్చించి నియోజకవర్గాల నాయకులకు నివేదించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ప్రతి ఇంటి సమాచారాన్ని పొందుపరచి, వారి అవసరాలను తెలుసుకుని ఆయా సమస్యలను పరిష్కరించాలని తీర్మానించారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాల్లో నాయకులంతా పాల్గొని ఆరోగ్య వంతమైన పరిసరాల కోసం తమ వంతు కృషి చేయాలన్నారు. కావలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు పాల్గొని చర్చించి తీర్మానాలు రూపొందించారు. ఈ సమావేశంలో కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ దామివెట్టి సుధీర్‌నాయుడు, శ్రీమతి పులి రజని, ఊసా వెంకట్రావ్, జెట్టి శేషారెడ్డి, రవ్వా సుబ్బారావు, సోమిశెట్టి రవిశేఖర్, మేడికొండ భారతి, ద్రోణాదుల వెంకట్రావ్, మైనార్టీశాఖ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, మేడికొండ సుకుమార్, మద్దూరు శేషయ్యయాదవ్, షేక్ ఉమర్‌బాబు, పర్వీన్‌జానీ, గొర్రెపాటి బ్రహ్మయ్య, ఎస్సి సెల్ అధ్యక్షుడు దేవకుమార్, అక్కిలిగుంట సూర్యప్రకాష్, రఫి, రంగి నాగేశ్వరరావు, శివ,సుధాకర్, మల్లికార్జున, శ్రీధర్, సుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పారిశ్రామికాభివృద్ధి ఘనత నెహ్రూదే!



దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన ఘనత నెహ్రూదేనని, ఆయన అలీనోద్యమ నిర్మాతగా ప్రపంచ ప్రఖ్యాతి పొందారని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వి.వీరయ్య పేర్కొన్నారు. ఈ నెల 12న నెహ్రూ జయంతిని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు విఆర్ ఐపిఎస్ కళాశాలలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు చాచానెహ్రూ చెకుముకి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వి.వీరయ్య మాట్లాడుతూ 6 నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలోని శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సహజ జ్ఞానం పెంపొందించేందుకు ఇటువంటి ప్రతిభా పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. వాస్తు శాస్త్ర నిపుణులు వాస్తు రామచంద్రరావు, నన్నేసాహెబ్, భవానీ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నాగేశ్వరరావు సేవలు ఆదర్శనీయం



నేటితరం జర్నలిస్టులకు సీనియర్ జర్నలిస్టు జనత దిన పత్రిక ఎడిటర్ దివంగత మువ్వా నాగేశ్వరరావు ఆదర్శమని నెల్లూరుజిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటి డైరెక్టర్ లాల్‌జాన్ పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ ఆఫ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నాగేశ్వరరావు సంతాప సభలో ఆయన మాట్లాడుతూ 1976వ సంవత్సరం నుంచి జనత దిన పత్రికను ప్రచురించారని, పత్రికా వ్యవస్థాపకుడైన రామమోహన్‌రావుతో పాటు అతని కుమారుడైన నాగేశ్వరరావు ఎందరో ఔత్సాహికులను జర్నలిస్టులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి రమేష్‌బాబు, సర్వేపల్లి రామమూర్తి, తదితర జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 80వ జన్మదిన శాంతి మహోత్సవం



రొటేరియన్ వొమ్మిన సుబ్రహ్మణ్యం అశీతివర్ష జన్మదిన శాంతి మహోత్సవం ఈ నెల 10న నెల్లూరు శ్రీ తల్పగిరి రంగనాథస్వామి కళ్యాణ వేదికలో జరిగింది. ఈ సందర్భంగా మాచవోలు రాజశేఖరశాస్త్రి గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, గణపతి హోమం, మహాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వొమ్మిన సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులు పాల్గొని వొమ్మిన సుబ్రహ్మణ్యం దంపతులకు పాదపూజ నిర్వహించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

# జెయస్ఆర్ సేవలు అభినందనీయం



సింహపురి ఆర్ట్స్ మూమెంట్ నాటక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్న జెయస్ఆర్ ఆంజనేయులను నెల్లూరు జడ్పీ వాకర్స్ అసోసియేషన్‌వారు ఇటీవల ఘనంగా సన్మానించారు. నగరంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి సాహితీవేత్త చలంచర్ల భాస్కరరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జడ్పీ వాకర్స్ సంఘానికి కార్యదర్శిగా జెయస్ఆర్ ఆంజనేయులు చేసిన సేవలను కొనియాడారు. బిరుదవోలు రామిరెడ్డి, టివి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'దేశం'లో...

# పాదయాత్ర ప్రకంపనలు

**ప్రజా సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై దండెత్తుతూ ప్రతిపక్ష నేత, వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి వై.యస్.ఆర్ జిల్లా ఇడుపుల పాయ నుండి మొదలుపెట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రభంజనం సృష్టిస్తోంది. అధికార తెలుగుదేశం పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది.**

జగన్ పాదయాత్రను తెలుగుదేశం వాళ్ళు మొదట ఆషామాషీగా తీసుకున్నారు. నంద్యాల ఎన్నికల్లో కూడా జగన్ సభలకు జనం బాగానే వచ్చారు. అయినా మేమే గెలిచాం... ఇక అన్ని చోట్లా అలాగే ఉంటుందిలే అనుకున్నారు. నంద్యాల ఎన్నికలు వేరు... అది కేవలం ఒక అసెంబ్లీ పరిధికి లోబడిన ఎన్నికలు. ఒక రకంగా పంచాయితీ ఎన్నికలు మాదిరిగా జరిగాయని చెప్పొచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గాని, ప్రభుత్వ వైఫల్యాలు గాని ఆ ఎన్నికలపై ప్రభావం చూపలేదు. మా నంద్యాలకు ఏమిచ్చారు... మాకు ఏం తెచ్చారు అన్న విధానంలోనే జరిగిన ఎన్నిక అది. ఈ ఎలక్షన్‌లో ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ప్రభుత్వమేమీ మారేదిలేదు... అన్న ఆలోచన ప్రాతిపదికగా జరిగిన ఎన్నిక కాబట్టి దానిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు.

కాని, ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఎంత వ్యతిరేకత ఉందన్నది జగన్ పాదయాత్ర ద్వారా ప్రస్ఫుటమవుతోంది. ఇడుపుల పాయ నుండి ప్రారంభమైన ప్రజాసంకల్ప యాత్ర కడప జిల్లాలోని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల మీదుగా కర్నూలు జిల్లాలో ప్రవేశించింది. ఇప్పటివరకు జరిగిన పాదయాత్రను గమనిస్తే పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా జనం పోటెత్తి వస్తున్నారు. జగన్‌కు నీరాజనం పలుకుతున్నారు. అన్ని వర్గాల ప్రజలు వస్తున్నారు. జగన్‌కు తమ సమస్యలు చెప్పుకుంటున్నారు. పేదల ఇళ్ళలో ప్రజల ముంగిళ్ళలో జనంతో జగన్ మమేకమవుతున్న తీరు 2003లో దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి పాదయాత్రను తలపించేలా వుంది. జగన్ పాదయాత్రకు జనం స్వచ్ఛంధంగా వస్తున్నారు. ఆయనతో కలిసి నడవడానికి ఉత్సాహం చూపుతున్నారు. రాజన్న బిడ్డ వచ్చాడంటూ జనం ఆత్మీయంగా అక్కున చేర్చుకుంటున్నారు.

అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించి జగన్ పాదయాత్రకు శ్రీకారం చుట్టాడు. ఒక రకంగా ఇది ఎలక్షన్ క్యాంపెయిన్ అనే అనుకోవచ్చు. ప్రతిపక్ష నేతకు వున్న అవకాశం ఇది. ప్రజాసమస్యలపై నడుస్తూ రాష్ట్రమంతా తిరగొచ్చు. కాని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆ పని చేయలేడు. ఆయన ప్రజాసమస్యలపై పాదయాత్ర చేస్తే ప్రభుత్వం ఫెయిల్యూర్ అని లెక్క.

జగన్ పాదయాత్రతో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల్లో చాలా మార్పులు రావచ్చు. నంద్యాల ఓటమితో దిగాలుపడ్డ వైకాపా కేడర్‌కు జగన్ పాదయాత్ర ఎక్కడలేని ఉత్సాహాన్నిచ్చింది. అదే సమయంలో అధికారపార్టీలో భయం మొదలైంది. ఎందుకంటే ఈ రాష్ట్రంలో అధికారం చేతులు మారడానికి పెద్ద తేడా అవసరం లేదు. 2014 ఎన్నికల్లో అధికారంలోకొచ్చిన తెలుగుదేశంకు, ప్రతిపక్షంలో కూర్చున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మధ్య ఓట్ల తేడా కేవలం 5లక్షలే! 2014లో జగన్‌కు ఓటేసిన ప్రతి వంద మందిలో ఖచ్చితంగా 90 నుండి 95 మంది రేపటి ఎన్నికల్లో కూడా జగన్‌కే మద్దతునిస్తారు. మరి 2014లో తెలుగుదేశంకు ఓటేసిన ప్రతి వంద ఓట్లలో ఇప్పుడాయనకు 50 ఓట్లకు మించి గ్యారంటీ లేదు. మిగిలిన ఓట్లు అటూ ఇటైతే పరిస్థితి తలక్రిందులే!

జగన్ ప్రజాసంకల్పయాత్ర అలాంటి ఓటర్లనే ప్రభావితం చేస్తోంది. పోయిన సారి చంద్రబాబు మేధావి, అనుభవజ్ఞుడని చెప్పి తటస్థులు ఆయనకు ఓట్లేసారు. చంద్రబాబు ఈ మూడున్నరేళ్లలో అలాంటి వారి నమ్మకాన్ని కోల్పోయాడు. జగన్ మాత్రం అలాంటి వారి నమ్మకాన్ని పొందే విధంగా, తన నాయకత్వాన్ని నిరూపించుకునే దిశగా రాష్ట్రమంతటా నడుస్తున్నాడు. జగన్ పాదయాత్ర ఖచ్చితంగా అన్నివర్గాల వారిపై ప్రభావం చూపుతోంది. పాదయాత్రతో ఓట్ల బ్యాంకులు కదులుతాయనే ఆందోళన తెలుగుదేశం వర్గాలలో వ్యక్తమవుతోంది.

# శోభ కోల్పోయిన సభ

(మొదటి పేజీ తరువాయి)

కాని, ఇన్నేళ్ళ చరిత్రలో ప్రతిపక్షం పూర్తిగా సభను బహిష్కరించింది ఇదే తొలిసారి. అధికారపక్ష ఆగడాలను, స్పీకర్ పక్షపాత వైఖరిని నిరసిస్తూ ప్రతిపక్షం ఈ చర్యకు పూనుకుంది.

ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఎన్నడూ లేనంత ఘోరంగా రాష్ట్ర శాసనసభ తయారైంది. రాష్ట్ర విభజన తర్వాత ఏ.పి అసెంబ్లీ కళాకాంతులు కోల్పోయింది. అమరావతిలో కట్టిన అసెంబ్లీ భవనంలో సమావేశాలు జరుపుకుంటున్నాము. ఈ వర్షాకాల సమావేశాలు 10వ తేదీ నుండి మొదలుకాగా, ప్రధాన ప్రతిపక్షం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమావేశాలను బహిష్కరించింది. సభలో ప్రతిపక్షం లేకపోవడంతో సమావేశాలు సంతాప సభలా జరిగిపోతున్నాయి. ప్రభుత్వానికి పొగడ్తలు, ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రశంసల జల్లులు తప్ప సభలో చూడడానికి, వినడానికి ఇంకేమీ లేకుండాపోయింది.

అసెంబ్లీ సమావేశాలను ప్రతిపక్ష వైకాపా బహిష్కరించడంతో సభ వెలవెలపోయింది. అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాలను జనం చూడడం లేదు. అసలు సభలో ఏం జరుగుతుందో కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు.

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో ఎక్కువ మంది కొత్తగా ఎన్నికైన సభ్యులే! అసెంబ్లీ సమావేశాలు వారికి ఎంతో కీలకం. అసెంబ్లీ సమావేశాలంటే ప్రతిపక్షానికి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే వేదిక. ఏ ప్రతిపక్షం కూడా అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించదు. అలా చేయడం రాజకీయంగా పొరపాటు కూడా!

అయితే విధి లేని పరిస్థితుల్లోనే ప్రతిపక్షం అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాల్సి వచ్చిందన్న సంగతి వాస్తవం. ఈ మూడున్నరేళ్లలో సభను సభలాగా జరగనీయలేదు. అదేదో తెలుగుదేశం పార్టీ కార్యక్రమంగా జరుపుకుంటూ వచ్చారు. ఏ సభలోనూ చర్చలు ఆరోగ్యవంతంగా జరగలేదు. ప్రతిపక్ష నేత జగన్ ప్రజా సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను సభలో ప్రస్తావించినప్పుడల్లా తెలుగుదేశం మంత్రులు, ఎమ్మెల్యేలు లౌడ్‌స్పీకర్లలా గొంతులేసుకుని... నువ్వు అన్ని కోట్లు తిన్నావు, ఇన్ని కోట్లు తిన్నావని అరవడం తప్ప, సమస్యలపై ప్రతిపక్ష నేత అడిగిన ప్రశ్నలకు పద్ధతిగా సమాధానం చెప్పిన దాఖలాలే లేవు. నీ మీద కేసులున్నాయి, నువ్వు దొంగవు అంటూ చర్చను పక్కదారి పట్టించారు తప్పితే, సక్రమంగా చర్చించిన సందర్భాలే లేవు. అదీగాక, ప్రతిపక్ష నేత ఏదన్నా సబ్జెక్ట్‌పై లోతుగా మాట్లాడుతున్న సమయంలో స్పీకర్ మైక్ కట్ చేయడం ఒకటి. ప్రతిపక్షం అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడంలో ప్రభుత్వం కంటే స్పీకర్ పాత్రే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

రాష్ట్ర శాసనసభకు ఎంతో మంది స్పీకర్లుగా పనిచేశారు. మనం గత పాతికేళ్లలో చూసిన శ్రీపాదరావు, కె.ఆర్.సురేష్‌రెడ్డి, ప్రతిభాభారతి, యనమల రామకృష్ణుడు, నాదెండ్ల మనోహర్ వంటివారు సభా సాంప్రదాయాలను గౌరవిస్తూ సభను ఎంతో హూందాగా నడిపించారు. కాని, ఈ ప్రభుత్వంలో స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. స్పీకర్ సభలో అన్ని పక్షాలకు పెద్దమనిషిగా వ్యవహరించాలి. కాని, ఈ ప్రభుత్వంలో స్పీకర్ ఒక పక్షం వారికి మాత్రమే పెద్దన్నగా వ్యవహరించారు. వైకాపాకు చెందిన 22మంది ఎమ్మెల్యేలను వారిచేత విలువలకు కట్టుబడి రాజీనామా చేయించకుండానే చంద్రబాబు తన పార్టీలోకి తీసుకుంటే... ప్రజాస్వామ్యానికి పాతరేసే ఈ పనిని అడ్డుకోండి... ఫిరాయింపు నిరోధక చట్టం క్రింద ఆ ఎమ్మెల్యేలపై చర్య తీసుకోండంటూ ప్రతిపక్ష సభ్యులు కోరినా స్పీకర్ నుండి ఎటువంటి చర్య లేదు. అసలు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయాలనే ఆలోచన కూడా చేయలేదు. అదేమంటే మీరు కోర్టుకెళ్లారు కదా... కేసు కోర్టు పరిధిలో వున్నప్పుడు నేను చర్య తీసుకోకూడదంటారు. స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదనేగా ప్రతిపక్షం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.

ఇలా అసెంబ్లీ ప్రతిష్టను ప్రభుత్వమే మంట గలిపింది. ప్రతిపక్షం బహిష్కరించడంతో అసెంబ్లీ సమావేశాలకు అర్థం పర్థం లేకుండా పోయి, అవి చెక్కభజన కార్యక్రమాలుగా మారాయి.

## ఆనం సోదరులకు
# పరామర్శ

రాజ్యసభ సభ్యులు కె.వి.రామచంద్రరావు, రాష్ట్ర మున్సిపల్ శాఖా మాత్యులు పి.నారాయణలు ఈ నెల 16వ తేదీన నెల్లూరులోని ఆనం వారి ఇంటికి విచ్చేసి శ్రీమతి ఆనం వెంకటరమణమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అనంతరం తల్లిని కోల్పోయి విషాదంలో వున్న ఆమె కుమారులు ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, కుటుంబసభ్యులను వారు పరామర్శించారు.







## తెలుగు తెరపై...
# 'నంది' చిచ్చు!



ఈ రాష్ట్రంలో ప్రతిదీ రాజకీయమైపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ పని చేసినా దాని వెనుక ఓట్ల మర్మం దాగి వుంటుంది. లేదా పూర్తిగా రాజకీయ కోణం వుంటుంది. ఆ రాజకీయ కోణం ఇప్పుడు సినిమా రంగాన్ని కూడా వదల్లేదు.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు సినీ పరిశ్రమకు సంబంధించి నంది అవార్డులు ప్రకటించలేదు. 2014, 2015, 2016 సంవత్సరాలకు గాను మొన్న ఒకేసారి రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డును ప్రకటించింది. నంది విజేతల ఎంపికలో నందమూరి కుటుంబానికి పెద్దపీట వేసి సినీ పరిశ్రమలో నందమూరికి పోటీగా వున్న మెగా ఫ్యామిలీ ప్రాధాన్యత తగ్గించడం వివాదాలకు ఆజ్యం పోస్తోంది. కేవలం బంధుప్రీతితోనే నంది అవార్డుల ఎంపిక జరిగిందంటూ ఇప్పటికే సినీరంగం నుండి పలువురు విమర్శలు మొదలుపెట్టారు. 2014లో ఉత్తమ నటుడుగా బాలకృష్ణ, 2015లో మహేష్, 2016లో జూనియర్ ఎన్టీఆర్‌లు ఉత్తమ నటులుగా ఎంపికయ్యారు. 2014లో లెజండ్‌ను, 2015లో బాహుబలిని, 2016లో జనతాగ్యారేజ్‌ను ఎక్కువ అవార్డులు వరించాయి.


సినీ పరిశ్రమలో మెగా కుటుంబం నుండి చిరంజీవితో పాటు పవన్ కళ్యాణ్, నాగబాబు, రామ్‌చరణ్, సాయి ధర్మతేజ, అల్లు అర్జున్, అల్లు శిరీష్, కంచె హీరో వరుణ్‌తేజ వున్నారు. వీరిలో చిరంజీవిని 2016 సంవత్సరానికి రఘుపతి వెంకయ్య జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. అల్లు అర్జున్‌కు రుద్రమదేవి సినిమాకుగాను ఉత్తమ సహాయనటుడు అవార్డు లభించింది. ఈ మూడేళ్ళలో మెగా ఫ్యామిలీ నటుల నుండి మంచి సినిమాలే వచ్చాయి. అల్లు అర్జున్ నటించిన సన్ ఆఫ్ సత్యమూర్తి సినిమాలో ఎంతో మంచి సందేశం దాగి వుంది. అలాగే తెలుగువారి పౌరుషాన్ని చాటే 'రుద్రమదేవి' సినిమాకు ఒక్క ఉత్తమ సహాయ నటుడు అవార్డు తప్ప ఇంకేమీ దక్కలేదు. దీనిపై ఆ చిత్ర దర్శకుడు గుణశేఖర్ బహిరంగంగానే తన అసంతృప్తిని వెళ్ళగక్కాడు. జరిగిందో లేదో తెలియని కల్పిత కథను ఆధారంగా చేసుకుని తీసిన 'గౌతమీ పుత్ర శాతకర్ణి' సినిమాకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం వినోదం పన్ను మినహాయించింది. అదే వాస్తవ కథతో, తెలుగుజాతి పౌరుషాన్ని చాటే సారాంశంతో తీసిన రుద్రమదేవి సినిమాకు మాత్రం వినోదం పన్ను మినహాయించలేదు. ఆ చిత్ర దర్శకుడు దీనినే ప్రశ్నించాడు. గోదావరి పుష్కరాలప్పుడు 23మంది భక్తుల ప్రాణాలు తీసి సెట్టింగ్‌లు వేసి నిర్మించిన పుష్కరాల డాక్యుమెంటరీకి నంది రావడం ఆశ్చర్యం కలిగించే విషయం కాకపోవచ్చు... కాని నందుల ఎంపికలో మెగా ఫ్యామిలీని తక్కువ చేసి చూసారనే అభిప్రాయం సర్వత్రా వినవస్తోంది.

# కమలంలో గొడవలు

బీజేపీకి ఈ జిల్లాలో ఉండేది నలుగురు నాయకులు. 1983లో తప్ప ఇంతవరకు అసెంబ్లీకి గెలిచిన దాఖలాలు లేవు. గట్టిగా జడ్పీటీసీని గెలుచుకునే సత్తా లేదు. ఏ నియోజకవర్గంలోనూ బలమైన కేడర్ లేదు. రోజురోజుకీ పార్టీ నిర్వీర్యమవుతోంది. దీనికితోడు మళ్ళీ ఆ పార్టీలో వర్గ విభేదాల బిల్డప్ ఒకటి. 15వ తేదీ టౌన్‌హాలులో పార్టీ దళిత చైతన్య సదస్సును బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ దళిత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దారా సాంబయ్య కూడా వచ్చారు. ఈ సదస్సుకు పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డికి ఆహ్వానం లేదంటూ ఆయన వర్గీయులు గాంధీ బొమ్మ వద్ద నుండి ర్యాలీగా టౌన్‌హాల్ వద్దకు వచ్చి గొడవకు దిగారు. అక్కడ సురేంద్రరెడ్డి వర్గీయులు వీరిని అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తోపులాటలు, ఘర్షణ జరిగింది. పరిస్థితి శృతిమించడంతో పోలీసులు, బీజేపీ సీనియర్ నాయకులు రంగంలోకి దిగి అందరినీ శాంతింపజేశారు. మొత్తానికి క్రమశిక్షణ అని చెప్పుకునే పార్టీలో దానికి రక్షణ లేకుండా పోయింది.



# వీడేది లేదు...
## జగనే మా బలం... వైకాపానే మా గళం!



**కుక్కను చంపాలంటే దాని మీద పిచ్చికుక్క అనే ముద్ర వేయాలి. ఈ సూత్రాన్ని తెలుగుదేశం పార్టీ వాళ్ళు, ఆ పార్టీ అనుకూల మీడియా బాగానే పాటిస్తోంది. వైకాపాలో ఎమ్మెల్యేలను టార్గెట్ చేయడం, వాళ్ళు పార్టీ మారుతున్నారనే ప్రచారాన్ని మీడియా ద్వారా కల్పించడం, వారిలో కూడా పార్టీ మారాలనే ఆశ కలిగించడం... ఇదీ ఒక రొటీన్ పద్ధతి.**

రాష్ట్రంలో ఇంత వరకు ముగ్గురు ఎంపీలు, 22మంది ఎమ్మెల్యేలు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో నుండి తెలుగుదేశంలోకి ఫిరాయించారు. వీళ్ళందరిలో ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం. కొందరు అధికారం కోసం... కొందరు మంత్రి పదవుల కోసం... కొందరు అధికార పార్టీ వేధింపులు, అక్రమ కేసులకు తట్టుకోలేక... కొందరు డబ్బుకు అమ్ముడుపోయి... ఇవీ వీళ్ళందరు కూడా పార్టీ మారడానికి ప్రధాన కారణాలు. అయినా పార్టీ మారే టప్పుడు అందరూ చెప్పిన కంబైన్డ్ పచ్చి అబద్ధమేంటంటే అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నామని చెప్పడం.

తెలుగుదేశం వాళ్ళు తమ నెక్స్ట్ టార్గెట్ నెల్లూరుజిల్లాను పెట్టుకున్నారు. జగన్ పట్ల నెల్లూరుజిల్లా ఎమ్మెల్యేలు చాలా విశ్వాసం చూపించారనుకోవచ్చు. సొంత జిల్లా కడప నుండి ఇద్దరు ఎమ్మెల్యేలు జంప్ అయ్యారు. కర్నూలు జిల్లాలో అయితే ఇంకా ఎక్కువ. కాని, నెల్లూరుజిల్లాలో మాత్రం ఒకే ఒక్క ఎమ్మెల్యే పార్టీ మారాడు. అతను కూడా ఒకప్పుడు తెలుగుదేశం మనిషే! కాబట్టి అతనిని లెక్కలో తీసుకోవాల్సిన అవసరం కూడా లేదు. మిగతా ఆరుగురు ఎమ్మెల్యేలు మాత్రం జగన్‌కు గట్టిగా నిలబడివున్నారు. ఇది నెల్లూరుజిల్లా టీడీపీ నాయకులకు చాలా ప్రెస్టేజ్‌గా మారింది. కనీసం ఇంకో ఇద్దరు ఎమ్మెల్యేలనన్నా పార్టీలోకి తీసుకొచ్చి చంద్రబాబు వద్ద తమ టాలెంట్ చూపించుకోవాలని తెగ ఉబలాటపడుతున్నారు. మిగతా ఆరుగురు ఎమ్మెల్యేలెవరు కూడా డబ్బులకు లొంగే వాళ్ళు కాదు. అలాగని మంత్రి పదవులు ఇవ్వలేరు. కాబట్టి వారి బలహీనతల మీదే కొట్టాలనుకున్నారు. ఈ క్రమంలోనే సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిలను లక్ష్యంగా ఎంచుకున్నారు. 2014 ఎన్నికలకు సంబంధించి ఇద్దరి మీదా నకిలీ మద్యం కేసులు నమోదై వున్నాయి. అలాగే రామిరెడ్డి ప్రతాప్‌కు అమరావతి రాజధాని ప్రాంతంలో కొంత భూమి సమస్య వుంది. వీటిని ఆధారంగా చేసుకుని వీరిద్దరిపై ఒత్తిడి పెంచి తెలుగుదేశంలో చేర్పించాలని చూసారు. దాదాపు రెండేళ్ళుగా ఈ ప్రయత్నం, ఈ ప్రచారం జరుగుతూనే వుంది. తమ మీద ఇలాంటి అపోహలు వచ్చినప్పుడల్లా కాకాణి, ప్రతాప్‌లు ఖండిస్తూనే వున్నారు. ఇప్పుడు కూడా మరోసారి తమపై అలాంటి ప్రచారం వచ్చిన నేపథ్యంలో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా విలేకరుల సమావేశం పెట్టి తాము జగన్‌తోనే ఉంటామని తేల్చి చెప్పి అనవసరంగా జరుగుతున్న ప్రచారానికి తెరదించారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com